www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 16 | సెప్టెంబర్ | 2026 పేజీలు : 8

## కొలువు దీరిన గణనాథులు







3లో

## పెద్దాసుపత్రి అడ్డాగా
# సదరం పేరుతో భారీ వసూళ్లు..!






(ఫైల్)




ప్రజాపక్షం/ఖమ్మం : ఖమ్మం పెద్దాసుపత్రి అక్రమ వసూళ్లకు అడ్డాగా మారుతుంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా వందలాది మంది అనర్హులకు అర్హత లేకున్నా 40 శాతానికి పైబడి అంగవైకల్యం ఉన్నట్లు ధృవీకరణ పత్రాలు జారీ చేశారు. దీనిపై పలు ఫిర్యాదులు ఉన్నా ఉలుకు పలుకు లేదు. ఇప్పటికీ చాలా మంది వద్ద ధృవీకరణ పత్రాలు ఇప్పిస్తామని అర్హత వ్యవహారం మీరు మరిచిపోండి అంటూ పెద్ద మొత్తంలో వసూళ్లు చేశారు. మిగతా 2లో..

**-ఫిజియోథెరపి వైద్యురాలి నిర్వాహకం**
**-అర్హత లేకున్నా ధృవీకరణ చేస్తామని లక్షల్లో వసూళ్లు**
**-ధృవీకరణ పత్రాలు రాకపోవడంతో ఆవేదనలో బాధితులు**
**-డబ్బులు తీసుకున్నా.. కానీ ఇచ్చేశా..**
**-ఫిజియోథెరపి వైద్యురాలి వివరణ**

## తెలంగాణ సాయుధ పోరాట
# వారసులు కమ్యూనిస్టులే..



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : వీర తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని బిజెపి చరిత్రను వక్రీకరించాలని చూస్తే ఊరుకునేది లేదని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. సెప్టెంబర్ 17న సాయుధ పోరాట దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ రాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రఘు

**-బిజెపి చరిత్రను వక్రీకరించాలని చూస్తుంది**
**-సెప్టెంబర్ 17ను సాయుధ పోరాట దినోత్సవంగా ప్రకటించాలి**
**-సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం**

నాథపాలెం మండల పరిధిలోని చిమ్మపుడి, పాపటపల్లి గ్రామాల్లో సాయుధ పోరాట యోధుడు, ఆరు సార్లు శాసన సభ్యులుగా ఎన్నికైన మహ్మద్ రజబ్ అలీ విగ్రహానికి సిపిఐ జాతీయ సమితి మిగతా 2లో..

# అడవి సిరికి ఆన్‌లైన్ దారి..!




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : అడవిలో పండింది... గిరిజనుల చేతుల్లో తయారైంది. ఇక దేశవ్యాప్తంగా వినియోగదారుల ఇళ్లకు చేరనుంది. గిరిజనుల శ్రమకు సరైన గిట్టుబాటు కల్పించడంతో పాటు వారి ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించే లక్ష్యంతో భద్రాచలంలో భద్రగిరి మార్ట్ కొత్త అడుగులు వేస్తోంది. పర్యాటక రంగంతో అనుసంధానిస్తూ ఆర్గానిక్ అటవీ సంప్రదాయ గిరిజన ఉత్పత్తులను ఆన్‌లైన్ ద్వారా విక్రయించేందుకు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది.

**అటవీ ఉత్పత్తులకు భద్రగిరి బ్రాండ్...**

రూ.15 లక్ష్యల వ్యయంతో ఏర్పాటు చేసిన భద్రగిరి మార్ట్‌ను ఈ ఏడాది 27న శ్రీరామ నవమి సందర్భంగా

**- ఆదివాసీ ఉత్పత్తులకు డిజిటల్ రెక్కలు**
**- పర్యాటక రంగంతో అనుసంధానం**
**- ఆన్‌లైన్‌లోనే ఇక ఇంటికి గిరి ఉత్పత్తులు**
**- అటవీ ఉత్పత్తులకు భద్రగిరి బ్రాండ్**

గవర్నర్ ప్రారంభించారు. భద్రాచలం వచ్చే భక్తులు పర్యాటకులను ఆకర్షించేలా గిరిజన ఉత్పత్తులను ఒకే వేదిక పైకి తీసుకొచ్చారు. మిల్లెట్ బిస్కెట్‌లు ఇప్పపువ్వు లడ్డూలు బర్ఫీలు కరక్కాయపొడి తేనె సబ్బులు షాంపూలు కుంకుడుకాయలు అటవీ ఫలాలు సేంద్రయ తృణధాన్యాలు పప్పులు బియ్యం తదితర ఉత్పత్తులు మార్ట్‌లో అందుబాటులో మిగతా 2లో..

## పెద్దాసుపత్రి అడ్డాగా
# సదరం పేరుతో భారీ వసూళ్లు..!

(మొదటిపేజీ తరువాయి) ధృవీకరణ పత్రాలు రాకపోవడంతో కనీసం మేము ఇచ్చిన డబ్బులైనా ఇవ్వండి అంటే దానికి కూడా స్పందించకపోవడంతో లబోదిబోమంటున్నారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో ఫిజియోథెరపి వైద్యురాలు సదరం సెక్షన్‌లో పనిచేసే మరి కొంత మంది వైద్యులతో కలిసి ఒంటరి మహిళలు, వికలాంగ ధృవీకరణ పత్రాలు ఇప్పిస్తానని ఈ వసూళ్ల కార్యక్రమం చేపట్టారు. ఒక్కొక్కరి వద్ద నుంచి రూ. 30 వేల నుంచి రూ. 40వేల వరకు వసూలు చేశారు. సత్తుపల్లి మండలంలో ఒక గ్రామంలోనే 50 మంది అనర్హులకు వికలాంగ ధృవీకరణ పత్రాలు భారీ మొత్తంలో వసూళ్లు చేశారు. ఇప్పుడు అదే గ్రామానికి చెందిన కొందరి వ్యక్తుల వద్ద నగదు తీసుకుని పని చేయకపోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఫిజియోథెరపి వైద్యురాలితో పాటు మరి కొందరు కలిసి జిల్లా వ్యాప్తంగా భారీగా వసూళ్లు చేశారు. గడిచిన ఐదారు నెలలుగా సదరం ధృవపత్రాలకు సంబంధించి వసూళ్ల వ్యవహారం బయటపడుతున్న జిల్లాకు చెందిన మంత్రులు కానీ ఉన్నతాధికారులు కానీ కనీసం స్పందించకపోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అక్రమ వసూళ్ల వెనుక ఎవరైనా పెద్దలు ఉన్నారా లేకపోతే ఎందుకు ఈ అక్రమార్కులను వెనకేసుకొస్తున్నారన్న చర్చ సాగుతుంది. ఫోన్ పే ఆధారాలతో సహా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. బాధితులు ప్రజాపక్షం దినపత్రికను ఆశ్రయించడంతో ఈ విషయమై ఫిజియోథెరపి వైద్యురాలిని ప్రజాపక్షం ప్రశ్నించగా అవును డబ్బులు తీసుకున్నాను ఇప్పుడు పని కావడం లేదని కొంత ఇచ్చేశాను. గతంలో పనిచేసిపెట్టినప్పుడు ఎవరు మాట్లాడలేదు. నాకు అనారోగ్యంగా ఉండి పని కాకపోవడంతో ఇప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారు. అవసరమైతే మీపై కేసు పెడతా మా లాయర్‌తో మాట్లాడండి అంటూ సమాధానమిచ్చారు. సదరం సర్టిఫికెట్లకు సంబంధించి మీరు ఫోన్ పే ద్వారా డబ్బులు ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించగా పని చేద్దామనుకున్నాను. పేదలని సాయం చేద్దామని ఆశించాను. కానీ కుదరలేదంటూ సమాధానం ఇచ్చారు. తొలుత నాకు డబ్బులు ఎవరు ఇచ్చారంటూ ప్రశ్నించినప్పుడు ఫోన్ ద్వారా ఇచ్చిన స్క్రీన్ షాట్ చూపించడంతో మౌనం వహించారు. ఇది కేవలం ఒక గ్రామానికి సంబంధించిన విషయం మాత్రమే. జిల్లా వ్యాప్తంగా ఇటువంటి వసూళ్లు భారీగా జరిగాయి. వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.4వేలు చెల్లిస్తుండడంతో అర్హత ఉన్నా లేకపోయినా వికలాంగ ధృవీకరణ కోసం సదరం క్యాంపుల చుట్టూ తిరుగుతున్నారు. గ్రామాల్లో సదరం సర్టిఫికెట్లు ఒంటరి మహిళలకు సంబంధించిన ధృవీకరణలు ఇస్తామని చెప్పి రూ. 40వేల నుంచి రూ. 50వేల వరకు పైరవీకారులు వసూలు చేస్తున్నారు. వైరా, బోనకల్, సత్తుపల్లి, కల్లూరు, చింతకాని మండలంలో ఈ వసూళ్ల కార్యక్రమం జోరుగా సాగింది. ఇప్పటికే అనేక మంది అనర్హులు వికలాంగ ధృవీకరణ పత్రాలతో పింఛన్ పొందుతున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపితే ఈ అక్రమ వసూళ్ల వెనుక ఉన్న వైద్యులెవరు, కేవలం ఫిజియోథెరపిస్టు మాత్రమే వసూళ్లకు పాల్పడిందా ఆమె ఎవరు సహకరించారనే విషయం వెలుగులోకి వస్తుంది. ప్రజాప్రతినిధులు సైతం ఆ అక్రమ వ్యవహారాలపై దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో ధృవీకరణలు ఇప్పిస్తామని వసూళ్లు చేసినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.

# అడవి సిరికి ఆన్‌లైన్ దారి..!




(మొదటిపేజీ తరువాయి)
ఉన్నాయి. ముఖ్యంగా గిరిజన మహిళలు తయారు చేస్తున్న మిల్లెట్ బిస్కెట్లకు డిమాండ్ పెరుగుతోంది. ఏజెన్సీ గ్రామాల నుండి గిరిజన మహిళలు రైతులు నేరుగా తమ ఉత్పత్తులను మార్ట్‌కు సరఫరా చేస్తున్నారు. మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గించి ఉత్పత్తిదారులకే మెరుగైన ధర దక్కేలా ఈ విధానం సాగుతోంది.

**గిరిజన కుటుంబాలకు లబ్ధి ...**

భద్రగిరి మార్ట్ ద్వారా సుమారు 100 గిరిజన కుటుంబాలకు లబ్ధి, మరో 10 కుటుంబాలకు ప్రత్యేక ఉపాధి లభిస్తున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని ఆర్గానిక్ అటవీ సంప్రదాయ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో కనిపించే వారపు గిరిజన సంతల వాతావరణాన్ని మార్ట్‌లో పునఃసృష్టించి గిరిజన ఉత్పత్తులను పర్యాటకులకు పరిచయం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

**పర్యాటక రంగంతో అనుసంధానం...?**

భద్రగిరి మార్ట్‌ను పర్యాటక రంగంతో అనుసంధానం చేయడం చేశారు. ఈ క్రమంలో ఇక ఇక్కడ నుండి ఆన్‌లైన్ సేవలు కూడా వినియోగదారులకు అందనున్నాయి. గిరి ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించే ఆలోచనలో భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్ చేశారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు గావించారు. దీంతో ఇక గిరి ఉత్పత్తులు ఎంచక్కా ఇంటికే చేరనున్నాయి. ఐటిడిఏ పిఓ చర్యను పలువురు అభినందిస్తున్నారు.

**ఆర్గానిక్ అటవీ ఉత్పత్తులు బాగున్నాయి :**

**విజయలక్ష్మీ, హైదరాబాద్...**



భద్రగిరి మార్ట్ లో లభించే అటవీ ఆర్గానిక్ ఉత్పత్తులు చాలా బాగున్నాయి. మార్ట్ విషయం తెలుసుకుని రాముల వారి దర్శనం తర్వాత ఇక్కడికి వచ్చాం. ఆన్‌లైన్ సౌకర్యం కూడా కల్పించినందుకు ఇంతదూరం రాకుండా ఇక్కడి ఉత్పత్తులు నేరుగా ఇళ్లకు వస్తాయి.

**సరుకులు నాణ్యతగా ఉన్నాయి :**

**వసుందర, సత్తుపల్లి**



భద్రగిరి మార్ట్‌లో లభించే ఉత్పత్తులు చాలా నాణ్యంగా ఉన్నాయి. దూర ప్రాంతాల వారికి ఆన్‌లైన్ ద్వారా సరఫరా చేయడంతో ఆర్గానిక్ వస్తువులు ఇంటికి వస్తున్నాయి.

# తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే..

(మొదటిపేజీ తరువాయి)
సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతల రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం కుల మతాలకు అతీతంగా భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం జరిగిందన్నారు. నల్లమల గిరిప్రసాద్, రజబ్‌అలీ నాయకత్వంలో తెలంగాణ సాయుధ పోరాటం జరిగిందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బిజెపి, ఆర్‌ఎస్ఎస్‌కు ఎటువంటి సంబంధం లేదన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఈ పోరాట ఫలితంగా పది లక్షల ఎకరాల దొరల, భూస్వాముల భూములు పేదలకు పంచడం జరిగిందన్నారు. వేల గ్రామాలు విముక్తి పొందాయని, మూడు వేల మందికి పైగా కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు ప్రాణాలు అర్పించారన్నారు. ఇంతటి చారిత్రాత్మక పోరాటం నిర్వహించిన కమ్యూనిస్టులకు పేరు వస్తుందని నాడు బిఆర్ఎస్ నేడు కాంగ్రెస్ ప్రభుత్వాలు సాయుధ పోరాట దినోత్సవం జరపకుండా పేర్లు మార్చి జరపడం సరికాదన్నారు. సెప్టెంబర్ 17ను సాయుధ పోరాట దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. వారోత్సవాల ముగింపు సందర్భంగా సెప్టెంబర్ 17న హైదరాబాద్‌లోని నాంపల్లి గ్రౌండ్స్‌లో ముగింపు సభ జరుగుతుందని పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, జిల్లా సమితి సభ్యులు బోడా వీరన్న, నాయకులు ప్రొద్దుటూరి వెంకటరెడ్డి, ఉపసర్పంచ్ జులా వెంకటేశ్వర్లు, బానోత్ నాగేశ్వరరావు, నాదెండ్ల పుల్లయ్య, బత్తుల వెంకటేశ్వర్లు, గుగులోత్ హరి, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు గుండ్ల అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ యరగొర్ల మధు, గాడిచర్ల సత్యనారాయణ, వార్డు సభ్యులు ఉల్లెబోయిన విష్ణుమూర్తి, కాళంగి చిన్న పిచ్చయ్య, అల్లు చిన్న వెంకటరెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో అన్నదానం



ప్రజాపక్షం/మధిర: శ్రీకళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం వర్తక సంఘంలో వేంచేసి ఉన్న శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయం నందు ప్రతి మంగళవారం అన్న గోవిందంలో భాగంగా అన్నదాతలు మిరియాల రుత్విక్ గుప్తా పుట్టినరోజు సందర్భంగా వారి తండ్రి మిరియాల వెంకటరమణ గుప ధర్మపత్ని లావణ్యల సహాయంతో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వాహకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కపిలవాయి జగన్మోహన్‌రావు, వెచ్చా శ్రీనివాసరావు, కొల్లా శ్రీనివాసరావు, మిరియాల రమణ గుప్తా, రిత్విక్ గుప్తా, కోన ధనికుమార్, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, దోర్నాల రవి తదితరులు, కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్17న తెలంగాణ విమోచన దినోత్సవం



ప్రజాపక్షం/మధిర: సెప్టెంబర్17న తెలంగాణ చరిత్రలో చారిత్రక ఘట్టమని, ఈరోజు నిజాం నిరంకుశ పాలన నుంచి హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లోకి వచ్చిన చారిత్రక సందర్భాన్ని తెలంగాణ విమోచన దినోత్సవంగా గౌరవించడం ప్రతి తెలంగాణ బిడ్డ బాధ్యత అని బిజెపి రాష్ట్ర నాయకులు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి పాత్రికేయుల సమావేశంలో తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షతన శివరాజు సుమంత్, జిల్లా కార్యదర్శి రామిశెట్టి నాగేశ్వరరావు, అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, జిల్లా నాయకులు చిలివేరు సాంబశివరావు, జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు పాపట్ల రమేష్, కెవి తదితరులు పాల్గొన్నారు.

## మిస్ట్‌లో ఘనంగా ఇంజనీర్స్ డే



ప్రజాపక్షం/సత్తుపల్లి: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో గల మదర్ తెరిసా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో సర్ డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 166వ జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చలసాని హరికృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యాసంస్థల అధ్యక్షుడు చలసాని సాంబశివరావు విశ్వేశ్వరయ్య విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన విశ్వేశ్వరయ్య దేశానికి అందించిన ఇంజనీరింగ్ సేవలను కొనియాడారు. అనంతరం అభిరుచి క్లబ్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పోస్టర్ ప్రజెంటేషన్ నిర్వహించగా విద్యార్థులు ఆధునిక సాంకేతికత, సృజనాత్మకతతో రూపొందించిన ప్రాజెక్టులు, పోస్టర్లను ప్రదర్శించారు. విద్యార్థులు తరగతి గది బోధనతో పాటు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ హరికృష్ణ సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి. ఉదయ్ కిరణ్ భార్గవ్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.వి. రామచంద్రరావు, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యానగర్‌లో ఎస్ఐఆర్‌పై గ్రామసభ

ప్రజాపక్షం/చుంచుపల్లి: ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో భాగంగా మంగళవారం విద్యానగర్ గ్రామపంచాయతీలో బీఎల్ఓలతో గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో తహశీల్దార్ నాగరాజు పాల్గొని మాట్లాడుతూ జాబితాలో పేరు లేని వారు, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో ఓటు ఉండి ప్రస్తుతం పేరు లేని వారు సంబంధిత బీఎల్ఓలను సంప్రదించాలని సూచించారు. ఓటరు నమోదు, సవరణక అవసరమైన పత్రాలు, దరఖాస్తు విధానం, ప్రక్రియపై అవగాహన కల్పించార. పేర్లు, చిరునామలు తదితర వివరాల్లో తప్పులు ఉంటే సరిచేసుకునే అవకాశం ఉందన్నారు. ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా బీఎల్ఓలు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జీపీఓలు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికులపై అధికారుల ఒత్తిడి తగదు



ప్రజాపక్షం/చుంచుపల్లి: సింగరేణి కొత్తగూడెం ఏరియా, కార్పోరేట్ కార్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులపై పని భారం, అధికారుల ఒత్తిడి తగ్గించి, వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వివిధ పని ప్రాంతాల్లో నిర్వహించిన సమావేశాల్లో రమేష్ పాల్గొన్నారు. అవసరమైతే సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కమిటీ సభ్యులు పప్పుల ప్రమోద్, కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఏరియా కార్యదర్శి పిచ్చెట్టి శివ, కార్మికులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులకు లేకుండా మిర్చి కొనుగోళ్లు

ప్రజాపక్షం/వైరా: వైరా వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి క్రయవిక్రయాలపై మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు అధ్యక్షతన సోమవారం ట్రేడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, కొనుగోళ్ల ప్రక్రియ, ధరలు, భద్రత, మార్కెట్‌లో రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలపై చర్చించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మిర్చి కొనుగోళ్లు పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని చైర్మన్ సూచించారు. రైతులకు తగిన గిట్టుబాటు ధర లభించేలా వ్యాపారులు సహకరించాలని, మార్కెట్‌లో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులకు తావు లేకుండాఅధికారులు, వ్యాపారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కాపా సుధాకర్, డైరెక్టర్లు మోత్కూరు వెంకటేశ్వరరావు, షేక్ మౌలాలి, ఖమ్మం జిల్లా మార్కెటింగ్ అధికారి ఆర్.సంతోష్‌కుమార్, మిర్చి ఇన్స్పెక్షన్ టీం జె.నరేందర్, వీరాంజనేయులు, సుమన్, పృధ్వీరాజ్, డి.నిర్మల, సెక్రటరీ ఏన్కూరు, ఇంచార్జి సెక్రటరీ వైరా వి.వెంకటేశ్వర్లు కోల్డ్ స్టోరేజ్ యజమానులు, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కొలువు దీరిన గణనాథులు






**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వినాయక చవితి సందర్భంగా వాడవాడలా గణనాథులు కొలువు దీరారు. ఖమ్మం నగరంలో గణేష్ నవరాత్రోత్సవాలు అంబరాన్ని అంటాయి. సోమవారం వినాయక చవితిని పురస్కరించుకుని వీధి వీధిన లంబోదరుడు కొలువు దీరాడు. ప్రధాన కూడలితో పాటు కాలనీలు, బహుళ అంతస్తుల భవనాలు గణపతి బప్పా మోరియా నామస్మరణంతో మారుమ్రోగాయి. భక్తులు ఉదయం నుంచే మండపాల వద్దకు చేరుకుని




ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఖమ్మం నగరంలో పలు ప్రాంతాల్లో వివిధ రూపాల్లో ఉన్న గణనాధుల భారీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. పర్యావరణ హితం కోరుతూ మట్టి విగ్రహాలను పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో తగు ఏర్పాట్లు చేశారు.

# మార్క్‌ఫెడ్ ద్వారా పెసలు కొనుగోలు చేయాలి

### సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని



**ప్రజాపక్షం/చింతకాని :** మార్క్‌ఫెడ్ ద్వారా పెసర పంట కొనుగోలు చేసి మద్దతు ధర క్వింటాకు రూ.8682 లు చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో చింతకాని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పోతినేని మాట్లాడుతూ ఎలినినో ప్రభావంతో రైతాంగం వర్షాభావ పరిస్థితుల్లో పంటలు ఎండిపోయే దశలో ఉండి ఇబ్బందులు పడుతుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ వ్యతిరేక విధానాలతో వ్యవసాయం సంక్షోభంలో పడిందన్నారు. మండలంలో రైతులు సాగర్ నీటిపై ఆధారపడ్డారని ప్రస్తుతం వేలాది ఎకరాల్లో పత్తి పంట చేతికొచ్చే సమయంలో ఎండిపోతుందన్నారు. ఆరుతడి పంటలకు వారా బందిగా అయినా సాగర్ నీటిని విడుదల చేసి పంట కాపాడాలన్నారు. ప్రస్తుతం పెసర పంట మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని , మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన మొక్కజొన్న పంట బస్తాల డబ్బులు తక్షణమే రైతుల ఖాతాల్లో జమచేయాలని , యూరియా యాప్ రద్దుచేసి రైతులకు సరిపడా యూరియాను అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతాంగ సమస్యల పై తహసీల్దార్ కరుణశ్రీకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మాదినేని రమేష్, మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి దేశబోయిన ఉపేందర్, నాయకులు వత్సవాయి జానకిరాములు, తోటకూరి వెంకటనర్సయ్య, నన్నక కృష్ణమూర్తి, పులి యజ్ఞనారాయణ, కిరణ్‌బాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పంటలను పరిశీలించి నమోదు చేయాలి

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** డిజిటల్ క్రాప్ సర్వేలో ప్రతి పంట క్షేత్రాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించి నమోదు చేయాలని మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని చిమ్మపుడి, పాపటపల్లి గ్రామాల్లో గ్రామ వాలంటీర్ల ద్వారా నిర్వహిస్తున్న డిజిటల్ క్రాప్ సర్వే పంటల నమోదు ప్రక్రియను మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరరెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంట క్షేత్రాన్ని గ్రామ వాలంటీర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడ సాగులో ఉన్న పంటను నిర్ధారించి వాటిని ఫోటో తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. రైతు చెప్పిన సమాచారంతో పాటు వాస్తవంగా క్షేత్రంలో ఉన్న పంటను పరిశీలించి నమోదు చేయడం ద్వారా సర్వేలో ఖచ్చితత్వం ఉంటుందన్నారు. ప్రస్తుతం వరి సాగుకు సంబంధించి సన్న రకాలు, లావు రకాలు గుర్తించి నమోదు చేయాలని వాలంటీర్లకు సూచించారు. రైతు సాగు చేస్తున్న వరి విత్తన రకాన్ని కూడా గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రైతు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పంట వివరాలు, విస్తీర్ణం, విత్తన రకం తదితర వివరాలు ఎటువంటి పొరపాట్లు లేకుండా



నమోదు చేయాలన్నారు. ఏడు సన్న వరి రకాల నమోదుకు రైతులు సహకరించాలన్నారు. ప్రభుత్వం సూచించిన సన్న వరి రకం విత్తనాలు కొనుగోలు చేసి వాటి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు షాపుల వద్ద బిల్లు తీసుకుని భద్రపర్చుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదైతే ప్రభుత్వం పంట కొనుగోలు చేసే సమయంలో ఇబ్బందులు ఉండవన్నారు.

# బారుగూడెం అంగన్వాడీ కేంద్రంలో పోషణ మహా కార్యక్రమం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 18వ వార్డులో గల అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ మహా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కౌన్సిలర్ అరుణ, సిడిపిఓ సిహెచ్ కమలప్రియ మాట్లాడుతూ...గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉండేందుకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ప్రతి రోజూ తీసుకోవాల్సిర అవసరంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రం



ఆధ్వర్యంలో ధాన్యాలు, చిరుధాన్యాలు, గుడ్లు, పప్పుదినుసులు, ఆకుకూరలు, పాలు, పాల పదర్థాలు, రాగులు, శనగలు తదితరు పోషకాహార పదార్థాలను ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. అనంతరం పోషణ మాసం సందర్భంగా పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాలతికుమారి, ఏఎన్ఎం సిహెచ్ నాగమణి, పాఠశాల హెచ్ఎం రమణ, అంగన్వాడీ టీచర్ కె.నాగమణి, ఆయా కళాశాతితో పాటు గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

# 18 బహుమతులతో చైతన్య టెక్నో స్కూల్ టాప్

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని సదాశివ పాలెం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు 18 బహుమతులు సాధించి మొదటి



స్థానంలో నిలిచారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ వై. మురళీకృష్ణ బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరుసగా రెండోసారి మండల చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నామని ఇందులో 4 ప్రథమ, 8 ద్వితీయ, 6 తృతీయ స్థానాలు ఉన్నాయన్నారు. అలాగే పాఠశాలకు చెందిన 24 మంది విద్యార్థులు జోనల్ గేమ్స్‌కు అర్హత సాధించారన్నారు. ప్రత్యేక క్రీడా శిక్షణ, అనుభవజ్ఞులైన వ్యాయామ ఉపాధ్యాయుల తర్ఫీదు వల్లే ఈ విజయం సాధ్యమైందని ప్రిన్సిపాల్ వై. మురళీకృష్ణ తెలిపారు. విజేతలను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

# సాయిస్ఫూర్తిలో ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలను ఎన్ఎస్ఎస్ విభాగం, కళాశాల యాజమాన్యం సంయుక్తంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ రంగంలో విశేష సేవలందించిన భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య జీవితం, క్రమశిక్షణ, అంకితభావం, దేశసేవ విద్యార్థులకు ఆదర్శమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ యాకూబ్ మాట్లాడుతూ జ్ఞానం, ఆవిష్కరణలు, సృజనాత్మకతతో సమాజ అభివృద్ధికి కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు.కళాశాల చైర్మన్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ బండి అన్విద వర్చువల్‌గా పాల్గొని ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు, డిప్లొమా డీన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బలుసుపాటి సీతారాములు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రూ.52వేల నగదు తిరిగిచ్చిన ఆపరేట్ విజయ్

### - నిజాయతీని అభినందించిన కమీషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** పొరపాటున తన బ్యాంకు ఖాతాలో జమ అయిన రూ.52వేల నగదును ఎలాంటి స్వార్థానికి తావులేకుండా తిరిగి పంపించి నిజాయితీని చాటుకున్నాడు ఏదులాపురంమున్సిపాలిటీ కంప్యూటర్ ఆపరేటర్ బుద్ధి విజయ్. ఈ నిజాయితీని తెలుసుకుని కమీషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం అభినందించారు. వివరాల్లోకి వెళితే...బుద్ధి విజయ్ కుమార్ బ్యాంకు ఖాతాలోకి ఆదిలాబాద్



జిల్లాకు చెందిన ఆకుల లక్ష్మి పొరపాటున రూ.52వేల నగదును జమ చేశారు. కొంత సమయం తర్వాత తన ఖాతాలోకి గుర్తుతెలీన నగదు జమ అయినట్లు గుర్తించాడు. వెంటనే అప్రమత్తమై నగదు సంబంధింత ఈ డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయో తెలుసుకునే ప్రయత్నం చేశాడు. తనకు వచ్చిన నగదు అడ్రస్సు ద్వారా ఆకుల లక్ష్మిని సంప్రదించి, నగదు పొరపాటున తన ఖాతాలోకి జమ అయిన విషయాన్ని తెలియజేశాడు. ఆమెకు చెందిన మొత్తాన్ని నిర్ధారించుకున్న తర్వాత రూ.52వేల నగదును ఫోన్‌పే ద్వారా పూర్తిగా తిరిగిపంపచాడు. ఈ ఘటనలో విజయ్ వ్యహరించిన తీరుపై మున్సిపల్ సిబ్బందితో పాటు పలువురి ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా కమీషనర్ శాలువతో సత్కరించి, ప్రత్యేకంగా అభినందిస్తూ...విధి నిర్వహణలోనే కాకుండా వ్యక్తిగత జీవితంలోనూ నిజాయితీ, బాధ్యాతయుతమైన ప్రవర్తనకు మంచి ఉదాహరణగా నలిచాడని ప్రశంసించారు. తోటి సిబ్బంది అంబటి వినయ్, రాజేశ్వరి, కృష్ణవేణి, సంధ్య సైతం అభినందనలు తెలిపారు.

# భర్తకు తలకొరివి పెట్టిన భార్య

### అంత్యక్రియలను పర్యవేక్షించిన మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్

**ప్రజాపక్షం/వైరా:** భర్తను కోల్పోయిన విషాదంలో భార్యే తలకొరివి పెట్టిన ఘటన వైరా మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో అందరిని కంటతడి పెట్టించింఇ. 9వ వార్డుకు చెందిన పువ్వాళ్ళ వెంకటేశ్వరరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. సోమవారం ఆయన అంత్యక్రియలను నిర్వహించారు. ఈ సందర్భంగా వెంక



టేశ్వరరావు భార్య పువ్వాళ్ళ కళావతి తన భర్తకు తలకొరివి పెట్టారు. భార్యే భర్తకు తలకొరివి పెట్టడం అక్కడున్న వారిని తీవ్రంగా కలిచివేసింది. వెంకటేశ్వరరావు అంత్యక్రియల కార్యక్రమాన్ని వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ దగ్గరుండి పర్యవేక్షించారు. కుటుంబ సభ్యులకు అండగా నిలిచి అంత్యక్రియలు సజావుగా జరిగేలా ఏర్పాట్లను స్వయంగా చూసుకున్నారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి కిరణ్, కర్నాటి హనుమంతరావు, పొదిల హరినాథ్, కోసూరి శ్రీనివాసరావు, కొల్లి రమేష్, మద్దెల రవి, మల్లు రామకృష్ణ, పెద్దప్రోలు లక్ష్మయ్య, సరిపుడి కోటేశ్వరరావు, సర్పంచ్ రాము, పాశం రవి, వెంకట్, సరిపుడి రాము, పుల్లారావు, మధు తదితరులు పాల్గొని వెంకటేశ్వరరావుకు నివాళులు అర్పించారు.

## జగన్నాథపురంలో అధ్వానంగా అంతర్గత రోడ్లు

### -గుంతలతో వాహనదారులకు నరకయాతన



**ప్రజాపక్షం/ములకలపల్లి:** జగన్నాథపురం పంచాయితీలో అంతర్గత రోడ్లు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారడంతో ప్రజలు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు గుంతల్లో నీరు చేరి రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. రాత్రివేళ గుంతలు కనిపించక ప్రమాదాల భయం నెలకొంది. రోడ్ల దుస్థితిపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో నేల, రైతు ఆరోగ్యానికి రక్షణ



**ప్రజాపక్షం/ములకలపల్లి:** రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ కింద ములకలపల్లి రైతు వేదికలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చి కిట్లు పంపిణీ చేశారు. మండల వ్యవసాయ అధికారి అరుణ్ బాబు మాట్లాడుతూ మూకమామిడిని ప్రకృతి వ్యవసాయ క్లస్టర్‌గా గుర్తించామని, 125 మంది రైతులు 125 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అందించిన కిట్లను మూకమామిడి సర్పంచ్ కోర్స ఆదిలక్ష్మీ, తిమ్మంపేట సర్పంచ్ తుర్రం శ్రీను రైతులకు అందజేశారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మళ్లాలని ఆదిలక్ష్మీ కోరారు. నేలసారంతో పాటు రైతుల ఆరోగ్యానికి కాపాడేందుకు ప్రకృతి వ్యవసాయం దోహదపడుతుందని శ్రీను పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రాహుల్, సూరిబాబు, రైతులు పాల్గొన్నారు.

## కరువు నుంచి రైతును ఆదుకోవాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** కరువు పరిస్థితులతో రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నందున ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టి ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం మండల అధ్యక్షుడు ముండ్ల ఏకాంబరం అధ్యక్షతన జరిగిన రైతు సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాభావంతో చెరువులు నిండకపోలాలు బీడువారాయని, ప్రస్తుత శాసన సభ సమావేశాల్లో కరువు పరిస్థితులపై చర్చించి ఎకరాకు రూ 20వేల పరిహారం ఇవ్వాలని కోరారు. సింగరేణి, కామేపల్లి మండలాల్లో సాగునీటి వనరులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సీతారామ ప్రాజెక్టు కోసం వెంటనే నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సింగరేణజ మండలంలోని రేలకాయలపల్లి, బాజుమల్లాయిగూడెం, మాణిక్యారం, కోమట్లగూడెం, ఉసిరికాయలపల్లి రెవెన్యూ గ్రామాల్లో పేదల భూములు నిషేధిత జాబితాలో ఉండటంతో రుణాలు పొందడం, భూములు విక్రయించడం సాధ్యం కావడం లేదన్నారు. రైతాంగ సమస్యలపై దశలవారీ ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ఈకార్యక్రమంలో దుగ్గి కృష్ణ, ఇంజం నాగభూషణం, వజ్జా రామారావు, పాపినేని నాగేశ్వరరావు. కరపటి సీతారాములు, ఎస్‌కె సైదులు, పిప్పాల కృష్ణ, బారు నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## 28న ఖమ్మంలో ఏఐకేఎంఎసస్ బహిరంగ సభ



**ప్రజాపక్షం/కూసుమంచి:** ఖమ్మంలో ఈనెల 28,29,30 తేదీల్లో జరిగే అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్)నాలుగో జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ కూసుమంచి మండల కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈకార్యక్రమానికి ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షుడు మాతంగి రామస్వామి అధ్యక్షత వహించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగు వెంకన్న, ఏఐకేఎంఎస్ మండల ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి వీరయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలతో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడుతోందని ఆరోపించారు. రైతులకు గిట్టుబాటు ధర, ఆదాయ భద్రత కల్పించడంతో పాటు వ్యవసాయ విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలపై భవిష్యత్ పోరాట కార్యాచరణకు ఖమ్మం మహాసభలు వేదిక కానున్నాయని తెలిపారు. ఈనెల 28న ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో జరిగే భారీ బహిరంగ సభకు రైతులు, కూలీలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఘనంగా జాతీయ పోషకాహార మాసం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** అమ్మగూడెం అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్ కళావతి ఆధ్వర్యంలో జాతీయ పోషకాహార మాస కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రధానోపాధ్యాయులు వెంగళ రావు పాల్గొని పోషకాహారం ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా మామిడికాయతో తయారు చేసే వివిధ ఆహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆయా మంజుల, ఉపాధ్యాయులు జ్యోతిర్మయి, తల్లిదండ్రులు శైలజ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అండ.. సిపిఐ జెండా..

**-తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తే ఊరుకోం**
**-బంధగిరినగరం గ్రామాన్ని ఏర్పాటు చేసిన ఘనత సీపీఐదే**
**-సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి**



**ప్రజాపక్షం/మణుగూరు/పినపాక:** తెలంగాణ నేలపై కమ్యూనిస్టుల పోరాట పటిమను, నాటి చారిత్రక వాస్తవాలను విస్మరిస్తే ఊరుకునేది లేదని సీపీఐ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి హెచ్చరించారు. పేద ప్రజలకు ఎప్పుడూ అండగా నిలిచేది కేవలం కమ్యూనిస్టు పార్టీ జెండా మాత్రమేనని స్పష్టం చేశారు. పినపాక మండలంలో ఎన్నో గ్రామాలను ఏర్పాటు చేసిన ఘనత సీపీఐకే దక్కుతుందని ఉద్ఘాటించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, అమరజీవి కామ్రేడ్ బందగీ పేరు మీదుగా వెలసిన ఈ బంధగిరినగరం ఏర్పాటు వెనుక నాటి కమ్యూనిస్టు నేతల విశేష కృషి దాగి ఉందని కొనియాడారు. మంగళవారం బంధగిరినగరంలో సీపీఐ మండల కార్యదర్శి తోగటి కుమార్ ఆధ్వర్యంలో సీపీఐ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పుల్లారెడ్డి మాట్లాడుతూ చారిత్రక వాస్తవాలను విస్మరించి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించడం సిగ్గుమాలిన చర్య అని ధ్వజమెత్తారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిన మహోద్యమ నిజమైన చరిత్రను భావితరాలకు, యువతకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. సమాజంలో అట్టడుగున ఉన్న పేదలకు ఎప్పుడూ అండగా నిలిచేది కమ్యూనిస్టు పార్టీ జెండా మాత్రమేనని ఆయన అన్నారు. పినపాక మండలంలో ఎన్నో గ్రామాలను ఏర్పాటు చేసిన ఘనత సీపీఐకి ఉందని, నేడు వేలాది మంది సంతోషంగా జీవించడానికి నాటి కమ్యూనిస్టుల పోరాటాలే ప్రధాన కారణమని పేర్కొన్నారు.కామ్రేడ్ బందగీ అమరత్వానికి గుర్తుగా ఏర్పడిన ఈ బంధగిరినగరం గ్రామాన్ని స్థాపించడంలో పార్టీ సీనియర్ నేతలు విశేషంగా శ్రమించారని కొనియాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, అమరజీవి బందగీ పేరు మీదుగా వెలసిన బంధగిరినగరం ఏర్పాటులో అమరజీవి పోలీస్ కొండయ్య విశేషంగా కృషి చేశారని గుర్తు చేశారు. నిజాం నవాబు రజాకార్ల దౌర్జన్యాలను ఎదిరించి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో వేలాది మంది రైతులు, కార్మికులు సాగించిన పోరాట పటిమను పుల్లారెడ్డి వివరించారు. దొడ్డి కొమురయ్య, మొహినుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి, చాకలి ఐలమ్మ, మ స్వరాజ్యం, చంద్ర రాజేశ్వరరావు తదితరుల నేతృత్వంలో ఈ మహోద్యమం నడిచింది. సెప్టెంబర్ 11 నుంచి 17వ తేదీ వరకు సాగిన భీకర పోరులో వేలాది మంది కమ్యూనిస్టు కార్యకర్తలు పాల్గొనగా, సుమారు 5,000 మంది ప్రాణత్యాగం చేశారు. ఈ వీరోచిత పోరాటాల ఫలితంగానే 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన సాధ్యమైంది. అంతేకాకుండా కమ్యూనిస్టు పార్టీ ఆనాడే సుమారు 24 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసి చరిత్రాత్మక మార్పు తెచ్చిందని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు గడ్డం మనోహర చారి, పత్తిపాటి నాగేశ్వరరావు, మండల సహాయ కార్యదర్శి కప్ప వెంకటేశ్వర్లు, తాంగేళ్లపల్లి వెంకన్న, సోంబోయిన చిన్న మల్లయ్య, పడిగ సడాలు, రమేష్, నూపా వెంకన్న, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## దేశ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర అత్యంత కీలకం

**ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్**



**ప్రజాపక్షం/మణుగూరు:** దేశ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర అత్యంత కీలకం అని ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ అన్నారు. భారతదేశ ప్రఖ్యాత ఇంజినీర్, దార్శనికుడు, భారతరత్న కీ.శే. మోక్షగుండం విశ్వేశ్వరయ్య 165వ జయంతిని పురస్కరించుకొని మంగర్గం రామచందర్ హాజరై విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన మరియు సాంకేతిక ప్రగతిలో ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజల సంక్షేమానికి, దేశ అభివృద్ధికి వినియోగించి, తన అపారమైన ప్రతిభతో ఇంజినీరింగ్ రంగంలో చెరగని ముద్ర వేసిన మహనీయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని కొనియాడారు. విశ్వేశ్వరయ్య తన దూరదృష్టి, సృజనాత్మక ఆలోచనలు, సాంకేతిక నైపుణ్యం మరియు అంకితభావంతో దేశ నిర్మాణంలో విశేషమైన సేవలు అందించారని తెలిపారు. ముఖ్యంగా నీటి వనరుల అభివృద్ధి, నీటి పారుదల, వరద నియంత్రణ తదితర రంగాల్లో ఆయన చేసిన కృషి భారతదేశ అభివృద్ధికి ఎంతో దోహదపడిందన్నారు. ఆయన జీవితం, కృషి మరియు విలువలు నేటి తరానికి, ముఖ్యంగా యువ ఇంజినీర్లకు ఎంతో స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఇంజినీర్స్ డేను కేవలం ఒక వేడుకగా నిర్వహించకుండా, విశ్వేశ్వరయ్య ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకొని సంస్థ అభివృద్ధికి, సాంకేతిక పురోగతికి మరియు దేశ ప్రగతికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఇంజినీర్లు తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ ఉత్పాదకత, భద్రత, నాణ్యత మరియు సంస్థ అభివృద్ధికి మరింతగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జి.ఎం డి. వెంకట రామారావు, ఏజీఎం (ఐఈడీ) సి.హెచ్. రాంబాబు, ఏజీఎం(పర్సనల్) ఎస్. రమేశ్ , డీజీఎం(సివిల్) శివ ప్రసాద్, ఏరియా సర్వే అధికారి ఎల్. దయాకర్, ఏరియా సేఫ్టీ అధికారి జి. నాగేశ్వర రావు, పర్యావరణ అధికారి జే. శ్రీనివాస రావు, క్వాలిటీ విభాగం (హెచ్డీ) నాగరమేష్, ఏరియా సెక్యూరిటీ అధికారి కే. శ్రీనివాస్, ఎస్ఈ(పర్చేస్) సుదర్శన్ రెడ్డి, ఫైనాన్స్ మేనేజర్ పి. రమేశ్ , డివై.ఎస్ఈ(సివిల్) కే. రాజేంద్ర ప్రసాద్, సీనియర్ పర్సనల్ అధికారులు కే. శ్రీనివాస్, శ్రీ వి. రామేశ్వర రావు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సుజాతనగర్‌లో గణనాథుల సందడి

**వాడవాడలా కొలువుదీరిన గణనాథులు**



**ప్రజాపక్షం/సుజాతనగర్:** వినాయక నవరాత్రి ఉత్సవాలతో సుజాతనగర్ మండలం పండుగ శోభను సంతరించుకుంది. మండలంలోని గ్రామాలు, కాలనీల్లో గణనాథులు కొలువుదీరగా, భక్తుల సందడి, గణేష్ భక్తిగీతాల హోరుతో పల్లెలు, కాలనీలు మార్మోగుతున్నాయి. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ గణపయ్యను దర్శించుకుంటున్నారు.

**ఆకట్టుకుంటున్న గణేష్ మండపాలు...**

ప్రతి గ్రామంలోనూ గణేష్ మండపాలను ఉత్సవ కమిటీలు ప్రత్యేకంగా తీర్చిదిద్దాయి. రంగురంగుల తోరణాలు, పుష్పాలంకరణలు, విద్యుత్ దీపాలతో మండపాలను సుందరంగా అలంకరించారు. రాత్రివేళ విద్యుత్ కాంతుల్లో మండపాలు ప్రత్యేక శోభను సంతరించుకుని భక్తులను ఆకట్టుకుంటున్నాయి. సుందరనగర్‌లో 101 కిలోల లడ్డూసుజాతనగర్ 21వ డివిజన్‌లోని సుందరనగర్ కాలనీలో గణనాథుడికి 101 కిలోల భారీ లడ్డూను నైవేద్యంగా సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదం అందజేశారు. భారీ లడ్డూ నైవేద్యం స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.పాటలు.. సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిగణేష్ మండపాల వద్ద భక్తి గీతాలు, గణేష్ పాటలు మార్మోగుతున్నాయి. సాయంత్రం వేళ చిన్నారులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొంటూ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పాటలు, నృత్యాలతో ఉత్సవాలు సందడిగా సాగుతున్నాయి. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలుగణేష్ మండప కమిటీ సభ్యులు ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, సామరస్యపూర్వక వాతావరణంలో కొనసాగుతున్నాయి.వాడవాడలా వెలిసిన గణనాథులు.. వెలుగులతో మెరిసిన మండపాలు.. భక్తి పాటలతో మార్మోగిన వీధులు.. సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిగా మారిన కాలనీలు.. వెరశి సుజాతనగర్ మండలంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నాయి.

# తెలంగాణ సాయుధ పోరాటానికి సజీవ సాక్ష్యం బ్రాహ్మణపల్లి..!

**-అగ్రనాయకులు నడయాడిన నేల..**
**కార్యకర్తలకు అందించిన కర్మాగారం**
**-ప్రతి కుటుంబంలో ఒక యోధుడు..**
**గాదె మాధవరెడ్డి త్యాగం స్ఫూర్తిదాయకం**
**-ఉద్యమానికి విస్తృతం చేసిన పారుపల్లి పుల్లయ్య**



**ప్రజాపక్షం/బోనకల్:** బాంఛన్ దొరా..నీ కాళ్లు మొక్కుతా.. అనే బానిసత్వ సంస్కృతి నుంచి''దొర ఏందిరో.. వాని పీకుండేందిరో'' అనే ధిక్కార స్వరాన్ని ప్రజల్లో నింపిన మహత్తర పోరాటమే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం. భూమి, భుక్తి, బానిస విముక్తి కోసం సాగిన ఈ పోరాటం దేశ చరిత్రలో చెరగని ముద్ర వేసింది. నాటి ఉమ్మడి వరంగల్ జిల్లాలో భాగంగా ఉన్న ప్రస్తుత ఖమ్మం ప్రాంతం కూడా ఈ పోరాటంలో కీలక పాత్ర పోషించింది. అందులో బోనకల్ మండలంలోని బ్రాహ్మణపల్లి ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిచింది.

**ఆంధ్ర మహాసభతో చైతన్యానికి బీజం**

తెలంగాణ ప్రాంతంలో సామాజిక, ఆర్థిక దోపిడికి వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చింది. 1945లో ఖమ్మంలో జరిగిన 12వ ఆంధ్ర మహాసభకు ఆరు తాలుకాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. బద్దం ఎల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ మహాసభకు చంద్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య వంటి అగ్రనాయకులు హాజరయ్యారు. ఈ మహాసభ ద్వారా స్ఫూర్తి పొందిన నాయకులు గ్రామాలకు వెళ్లి ప్రజలకు సమీకరించారు. మధిర తాలుకాకు చెందిన రావెళ్ల జానకిరామయ్య ఆధ్వర్యంలో గాదె మాధవరెడ్డి, పారుపల్లి పుల్లయ్య, చుండూరు నరసింహారావు, మల్లెల వెంకటేశ్వరరావు, తాళ్లూరి భద్రయ్య తదితరులు శిక్షణ పొంది ఆయా ప్రాంతాల్లో దళాలను ఏర్పాటు చేశారు.

**-కార్యకర్తల కర్మాగారం బ్రాహ్మణపల్లి**

రావెళ్ల జానకీరామయ్య వద్ద శిఓణ పొందిన గాదె మాధవరెడ్డి, పారుపల్లిపుల్లయ్యలు బ్రాహ్మణపల్లిలో దళాలను ఏర్పాటు చేసి రాపల్లి, పాలడుగు, సీతానగరం, గన్నవరం, ఖానాపురం, గొల్లపూడి తదితర గ్రామాల్లో ఉద్యమాన్ని విస్తరించారు. గాదె నారాయణరెడ్డి, గాదె పిచ్చిరెడ్డి, నల్లమల్ల గోపయ్య, కొంగర అచ్చయ్య, చావా మాణిక్యమ్మ, చావా అప్పయ్య, పారుపల్లి చినకోటయ్య తదితర నాయకులు ప్రజలను సమీకరించగా..కొంగర అప్పయ్య, పారుపల్లి కోటయ్య, పారుపల్లి రామకోటయ్య, జెర్రిపోతుల రాజారత్నం, వంగాల నారాయణ,వంగాల పెద్ద వెంకటేశ్వర్లు, వంగాల వీరభద్రం, గుడిదె శేషయ్య, గాదె బుచ్చిరెడ్డి తదితర యువకులు ఉద్యమంలోకి వచ్చారు. దళాలకు గ్రామ ప్రజలు అతిథ్యం ఇవ్వడం, ఒక్కో ఇంట్లో ఒక్కో దళ సభ్యుడికి భోజనం ఏర్పాటు చేయడం, సమావేశాల సమాచారాన్ని గోప్యంగా ఉంచడం వంటి చర్యలతో బ్రాహ్మణపల్లి ఉద్యమానికి బలమైన అండగా నిలిచింది. అందుకే ''ప్రతి కుటుంబంలో ఒక యోధుడు'' అనే గుర్తింపును ఈ గ్రామం సంపాదించుకుంది.

**-గాదె మాధవరెడ్డి త్యాగం స్ఫూర్తిదాయకం...**

1948లో పోరాటం ఉధృతంగా సాగుతున్న సమయంలో గాదె మాధవ రెడ్డి దళ నాయకుడిగా పనిచేశారు. కలకోటలో సమావేశానికి వెళ్లిన సమయంలో జరిగిన దాడిలో ఆయన దారుణంగా హత్యకు గురయ్యారు. ఆయనతో పాటు వెళ్లిన పారుపల్లి పుల్లయ్య త్రుటిలో తప్పించుకోగా, పైడిపల్లి జోగారావు కూడా ప్రాణాలతో బయటపడ్డారు. తదనంతరం జరిగిన పరిణామాల్లో పలువురు ఉద్యమకారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలు బ్రాహ్మణపల్లి, కలకోటతో పాటు పరిసర గ్రామాల ప్రజలను తీవ్రంగా కలిచివేశాయి. గాదె మాధవరెడ్డి త్యాగం నేటికీ ఈ ప్రాంత ప్రజల జ్ఞాపకాల్లో సజీవంగా ఉంది.

**-ఉద్యమాన్ని విస్తృతం చేసిన పారుపల్లి పుల్లయ్య...**

పారుపల్లి పుల్లయ్య మధిర తాలూకాకే పరిమితం కాకుండా ఇల్లందు, కొత్తగూడెం, బూర్గంపహాడ్, భద్రాచలం తదితర ప్రాంతాలకు వెళ్లి ఉద్యమాన్ని విస్తరించేందుకు కృషి చేశారు. వివిధ ప్రాంతాల్లో యువకులకు శిక్షణ ఇచ్చి వారిని కమ్యూనిస్టు ఉద్యమం వైపు నడిపించడంలో కీలక పాత్ర పోషించారు. ఉద్యమ కాలంలో పరిస్థితులకు అనుగుణంగా వివిధ పేర్లతో పనిచేస్తూ తన జీవితాన్ని ఉద్యమానికి అంకితం చేసిన పుల్లయ్యను ఆయన మరణించి దశాబ్దాలు గడిచినా ప్రజలు స్మరించుకుంటున్నారు. ఆయన సేవలకు గుర్తుగా భద్రాచలం నియోజకవర్గ సిపిఐ కార్యాలయానికి ''కామ్రేడ్ పారుపల్లి భవన్'' అని పేరు పెట్టారు.

**-అగ్రనాయకులు నడయాడిన నేల..**

తెలంగాణ సాయుధ పోరాట కాలంలో చంద్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య, నల్లమల్ల గిరిప్రసాద్, రావి నారాయణరెడ్డి, బొమ్మగాని ధర్మభిక్షం తదితర నాయకులు అగ్రనాయకుల బ్రాహ్మణపల్లిలో నివసించిన సందర్భాలు ఉన్నాయని స్థానిక చరిత్ర చెబుతోంది. గ్రామానికి సమీపంలో ఏరు ఉండటం, వ్యవసాయ పంటలు సమృద్ధిగా ఉండటం, ప్రజలు ఉద్యమానికి అండగా నిలవడంతో నాయకులు సమావేశాలు నిర్వహించేందుకు బ్రాహ్మణపల్లిని ఆశ్రయించేవారు. మధిర తాలూకాకు చెందిన సాయుధ దళాలకు శిక్షణ కూడా ఇక్కడే నిర్వహించేవారిని స్థానికులు పేర్కొంటారు. అందుకే బ్రాహ్మణపల్లి కేవలం ఒక గ్రామం మాత్రమే కాదు. నాయకులను, కార్యకర్తలను తయారు చేసిన కర్మాగారంగా చరిత్రలో నిలిచింది.

**-నేటికీ కొనసాగుతున్న పోరాట స్ఫూర్తి...**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తిని బ్రాహ్మణపల్లి ప్రజలు ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. దశాబ్దాల పాటు కమ్యూనిస్టు పార్టీ ప్రజా ప్రతినిధులను ఆదరించిన ఈ గ్రామంలో సాయుధ పోరాట యోధుడు కొంగర అప్పయ్య సుమారు మూడు దశాబ్దాల పాటు సర్పంచ్‌గా పనిచేశారు. 1969లో దివిసీమ తుఫాను కారణంగా గ్రామం తీవ్రంగా దెబ్బతిన్న సమయంలో ప్రజలను ఏకం చేసి పునర్నిర్మాణానికి కృషి చేయడంలో కొంగర అప్పయ్య కీలక పాత్ర పోషించారని స్థానికులు గుర్తుచేసుకుంటున్నారు. నేటికీ గ్రామ ప్రజలు నాటి యోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాలను కొనసాగిస్తున్నారు.

**-పాఠ్యాంశాల్లో చేర్చాలి :**

**తోట రామాంజనేయులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు**



తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తోట రామాంజనేయులు అన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు భాగస్వామ్యంతో సాగిన ఈ పోరాటం ప్రపంచ చరిత్రలో ప్రత్యేకమైనదని పేర్కొన్నారు. పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చి విద్యార్థులకు వాస్తవ చరిత్రను అందించాలని ఆయన కోరారు. చరిత్రను విస్మరిస్తే భవిష్యత్ తరాలకు వాస్తవాలు తెలియకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. భూమి కోసం..భుక్తి కోసం.. బానిస విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి బ్రాహ్మణపల్లి వంటి గ్రామాలు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

# సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించొద్దు

**- విలీన దినాన్ని అధికారికంగా జరిపించాలి**
**- టిజిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య శ్రీనివాస్**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వీర తెలంగాణ సాయిధ రైతాంగ పోరాటాన్ని చరిత్రను ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజలు హృదయాల్లో నుంచి చెరిపేయలేదని తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య శ్రీనివాస్ స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని శేషగిరి భవన్‌లో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మహత్తరపోరాటం భూమి కోసం భుక్తి కోసం సాగిందే తప్ప మతాల మధ్య ఘర్షణ కాదన్నారు. సెప్టెంబర్ 17ను మత విద్వేషాలకు వాడుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా విలీన దినోత్సవాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. కమ్యూనిస్టుల నేతృత్వంలో ప్రజలు సాగించిన ఉద్యమ వారసత్వాన్ని తుడిచిపెట్టే యత్నాలను తిప్పికొట్టాలని పీడిత ప్రజల హక్కుల సాధనకు ఆనాటి పోరాట స్ఫూర్తితో ఐక్యకంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సమాఖ్య ముఖ్యనాయకులు బానోత్ వెంకట్ గోవింద్ ఉపేందర్ హాతీరామ్ హరి రమేష్ సురేష్‌బాబు బావ్‌సింగ్ మోహన్ రవి రాంప్రసాద్ చందర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సభను విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** ఏఐకేఎంఎస్ నాలుగో జాతీయ మహాసభల సందర్భంగా ఈనెల 28న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను, 29,30తేదీల్లో జరిగే జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి వై ప్రకాష్ పిలుపునిచ్చారు. కారేపల్లి మండలం పేరుపల్లిలో ప్రచారం నిర్వహించి గోడ పోస్టర్లు ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టాయని వై ప్రకాష్ ఆరోపించారు. స్వామినాథన్ సిఫారసుల ప్రకారం పంటలకు గిట్టుబాటు ధర, కనీస వేతన చట్టం అమలు, ఢిల్లీ రైతాంగ ఉద్యమంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందాం, దేశాన్ని రక్షించుకుందామని నినాదంతో జరిగే బహిరంగ సభకు రైతులు, కూలీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి, అల్లం గురువయ్య, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, పద్మ, సుగుణ, మంగమ్మ పాల్గొన్నారు.

## రైతులకు 24గంటల విద్యుత్ ఇవ్వాలి




**ప్రజాపక్షం/కారేపల్లి:** రైతులకు 24గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణి మండలం భాగ్యనగర్ 33/11కేవీ సబ్ స్టేషన్ ఎదుట సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన అనుబంధ అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ మండల కార్యదర్శి గుమ్మడి సందీప్ మాట్లాడుతూ విద్యుత్ కోతలతో బోర్ల ద్వారా సాగు చేస్తున్న పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. అఖిల భారత ఐక్య రైతు సంఘం ఖమ్మం డివిజన్ నాయకుడు తేజ నాయక్ మాట్లాడుతూ విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో పుల్లకాని సత్తిరెడ్డి, రావుల నాగేశ్వరరావు, భూక్య నాగరాజు, గుమ్మడి ఎర్రయ్య, గుమ్మడి నరసింహారావు, రామారావు, కోడెం సీతారాములు, జోగ రవి, దోమల సుజాత, గుమ్మడి శిరీష, స్వర్ణభాకా అనసూయ, మోకాళ్ల కోటయ్య, దోమల కోటయ్య, దోమల నాగేశ్వరరావు, గుమ్మడి నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

## రూ186కోట్ల హెచ్ఏఎం నిధులతో పినపాకకు మహర్దశ



**ప్రజాపక్షం/అశ్వాపురం :** పినపాక నియోజకవర్గంలోని బీటీ రహదారులు, వంతెనల అభివృద్ధికి హెచ్ఏఎం నిధుల నుంచి సుమారు రూ 186కోట్లు మంజూరు చేయించడంపై అశ్వాపురం మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవతో నిధులు మంజూరయ్యాయని పేర్కొంటూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలకు కూడా ధన్యవాదాలు తెలిపారు. నిధులతో గ్రామీణ రహదారులు, వంతెనలు అభివృద్ధి చెంది రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు గ్రామాల మధ్య అనుసంధానం బలోపేతమవుతుందని పేర్కొన్నారు. దసరాలోపే పనులు ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నారని తెలిపారు. హెచ్ఏఎం విధానంలో పనులు పూర్తయిన తర్వాత సుమారు 15ఏళ్ల నిర్వహణ బాధ్యత సంబంధిత సంస్థలదే ఉండటంతో నాణ్యతకు భరోసా ఉంటుందని అన్నారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, సర్పంచులు ఇర్పా కవిత, ఎనిక ఉషారాణి, మచ్చ నరసింహారావు, కుంజా జాను, ఉప సర్పంచ్ ధరావత్ హర్షనాయక్, నాయకులు ఆవుల రవి, మట్టా వీరభద్రరెడ్డి, ఎనిక రవి, తెలం వీరభద్రం, సమకూరు వెంకన్న, లంకమల్ల కొండలరావు, బచ్చు వెంకటరమణ, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్లు గొల్లపల్లి నరేష్ కుమార్, వేముల విజయ్, జనరల్ సెక్రటరీ కంటెం నవీన్, బట్టి వెంకన్న, అండెం గంగరాజు, గొడ్ల ప్రవీణ్ పాల్గొన్నారు.

## యూరియా కోసం రైతుల అవస్థలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పంటలు సాగు చేసిన రైతులకు సకాలంలో యూరియా అందకుండా ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్ విధానాన్ని సమీక్షించి క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని రైతు సంఘం జిల్లా నాయకుడు యాడ్ల తిరుపతిరావు కోరారు. మంగళవారం నేలకొండపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటలు వేసి ఇప్పటికే 40 రోజులు దాటుతున్నా పలువురు రైతులకు ఇప్పటికీ యూరియా బస్తాలు అందని పరిస్థితి నెలకొందన్నారు. వాతావరణ పరిస్థితుల ప్రభావంతో కొంతమంది రైతులు పంటలు వేయలేకపోయారని, మరోవైపు పంటలు సాగు చేసిన రైతులకు అవసరమైన సమయంలో యూరియా అందకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు.రైతులు యూరియా కోసం రోజుల తరబడి తిరిగే పరిస్థితి లేకుండా, పంటలు సాగు చేసిన ప్రతి రైతును క్షేత్రస్థాయిలో గుర్తించి అవసరమైన మేరకు యూరియా అందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల వారీగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, వాస్తవంగా పంటలు సాగు చేసిన రైతుల వివరాలను నమోదు చేసి వారికి సకాలంలో యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని యాడ్ల తిరుపతిరావు కోరారు.

# తెలంగాణ సాయుధ పోరాటంలో బ్రాహ్మణపల్లి చారిత్రక కేంద్రం



**- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏనుగు గాంధీ**

**ప్రజాపక్షం/బోనకల్ :** నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో బోనకల్ మండలంలోని బ్రాహ్మణపల్లి చారిత్రక పాత్ర పోషించిందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏనుగు గాంధీ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం బ్రాహ్మణపల్లి, రాపల్లి గ్రామాల్లోని అమరులు కొంగర అప్పయ్య, నల్లమల్ల సత్యం స్థూపాల వద్ద సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావుతో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా సాయుధ పోరాట యోధుడు, సిపిఐ సీనియర్ నాయకుడు పారుపల్లి రాఘవులు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ అగ్ర నాయకులు నడయాడిన బ్రాహ్మణపల్లి ఉద్యమానికి నాయకులు, కార్యకర్తలను అందించిన కేంద్రంగా నిలిచిందన్నారు. రావెళ్ల జానకిరామయ్య వద్ద శిక్షణ పొందిన గాదె మాధవరెడ్డి, పారుపల్లి పుల్లయ్యలు బ్రాహ్మణపల్లిని కేంద్రంగా చేసుకుని పరిసర గ్రామాల్లో ప్రజలను చైతన్యపరిచారని తెలిపారు. గ్రామ ప్రజలు దళసభ్యులకు ఆశ్రయం, ఆహారం అందిస్తూ ఉద్యమాన్కి అండగా నిలిచారని, అందుకే బ్రాహ్మణపల్లికి ప్రతి కుటుంబంలో ఒక యోధుడు అనే గుర్తింపు వచ్చిందన్నారు. 1948లో కలకోటలో జరిగిన దాడిలో గాదె మాధవరెడ్డి అమరుడయ్యాడని, ఆయన త్యాగం నేటికీ ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తోందని అన్నారు. పారుపల్లి పుల్లయ్య మధిరతో పాటు ఇల్లందు, కొత్తగూడెం, బూర్గంపహాడ్, భద్రాచలం ప్రాంతాల్లో ఉద్యమాన్ని విస్తరించేందుకు విశేష కృషి చేశారని పేర్కొన్నారు. చండ్ర రాజేశ్వరరావు, పుచ్చపల్లి సుందరయ్య తదితర అగ్ర నాయకులు బ్రాహ్మణపల్లిలో బస చేసి సమావేశాలు నిర్వహించారని తెలిపారు. నాటి యోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఏలూరి రమేష్, సిపిఐ నాయకులు పారుపల్లి నర్సింహారావు, గుడిద కృష్ణ, మదుపల్లి వెంకటేశ్వర్లు, చావా నాగయ్య, కొంగర కృష్ణయ్య, వంగల హనుమంతరావు, రావుల వీరస్వామి, ఏనుగు రామకృష్ణ, చావా గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మధిర ప్రాంతీయ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షమ/మధిరః** ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల తీరును మెరుగుపరిచేలా దిశగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఇచ్చిన ఆదేశాల మేరకు మధిరలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత మంగళవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ముందస్తు సమాచారం లేకుండా ఆమె ఆసుపత్రికి రావడంతో సిబ్బంది ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. తనిఖీల్లో భాగంగా చైర్‌పర్సన్ నేరుగా వివిధ వివిధ వార్డులకు వెళ్లి రోగులను పలకరించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్యం, డాక్టర్ల పనితీరు, మందుల పంపిణీ తీరుపై ఆరాతీశారు. రోగులకు అందిస్తున్న భోజన వసతుల నాణ్యతను స్వయంగా పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా పిడి యాట్రిక్(చిన్న పిల్లలు) వార్డును సందర్శించి చిన్నారులకు అందుతున్న వైద్యసేవలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. అనంతరం ఆసుపత్రి రికార్డులు, సిబ్బంది హాజరు పట్టికను క్షుణ్ణంగా పరిశీలించారు. విధులకు గైర్హాజరైన వారి వివరాలను ఆసుపత్రి సూపరిండెంట్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ ప్రధాన ధ్యేమయి అన్నారు. వైద్యులు, సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లోను సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. విధుల్లో ఎవరి నిర్లక్ష్యాన్ని లేదా అలసత్వాన్ని సహించేది లేదని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ కె.శామ్యూల్‌పాల్, జిల్లా కాంగ్రేస్ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మిరియాల వెంకటరమణగుప్త, వైస్ చైర్మన్ కోన ధనికుమార్, కాంగ్రేస్ పార్టీ పట్టణ అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్ రమణనాయక్, నాయకులు సూర్యదేవర కోటేశ్వరరావు, దోర్నాల వెంకట రవి తదితరులు ఉన్నారు.

# రైతుకూలీ సంఘం మహాసభలను జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** ఈనెల 28,29,30తేదీల్లో ఖమ్మం నగరంలో నిర్వహించనున్న అఖిల భారత రైతుకూలీ సంఘం(ఏఐకేఎంఎస్) జాతీయ నాలుగో మహాసభలను జయప్రదం చేయాలని సంఘం మండల అధ్యక్షుడు గొర్రెపాటి వీరస్వామి పిలుపునిచ్చారు. ఈ మేరకు సంబంధిత గోడపత్రికలను ఆవిష్కరించి మండలంలోని జింకలగూడెం, తిప్పారెడ్డి గూడెం, పాతర్లపాడు, హస్నాబాద్ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి అచ్చ ఉప్పలయ్య, నాయకులు పోలేపొంగు నాగయ్య, పేరెం వెంకటేశ్వర్లు, బ్రహ్మచారి, పట్టాభి, షబ్బీర్, రమణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# తాళ్లచెరువు గ్రామపంచాయతీ ఎన్నికపై నేడు కోర్టులో తీర్పు..!




**- సుప్రీంకోర్టు నిబద్దతను ఉల్లఘించిన రిటర్నింగ్ అధికారి**
**- సర్పంచ్ గెలుపును సవాలు చేస్తూ కోర్టును ఆశ్రయించిన అభ్యర్థి గడిపుడి వీరభద్రం**

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** మండల పరిధిలోని తాళ్లచెరువు గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన బీఆర్ఎస్ అభ్యర్థి గడిపూడి వెంకటనారాయణ గెలుపును సవాల్ చేస్తూ కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి గడిపూడి వీరభద్రు కోర్టును ఆశ్రయించారు. గతేడాది సెప్టెంబరు14న జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో తాళ్లచెరువులో రిటర్నింగ్ అధికారి చేసిన తప్పిదాన్ని సవాల్ చేస్తూ సర్పంచి అభ్యర్థి గడిపూడి వీరభద్రం కోర్టును ఆశ్రయించారు. తాళ్లచెరువు గ్రామ పంచాయతీలో మొత్తం 656ఓట్లు ఉండగా ఎన్నికల్లో 8వార్డుల్లో మొత్తం 637ఓట్లు పోల్ కాగా పోటీ చేసిన అభ్యర్థులకు కౌంటింగ్ అనంతరం చెర్రీ 311ఓట్లు పోలయ్యాయని రిటర్నింగ్ అధికారి ప్రకటించగా..దానిలో 13ఓట్లు చెల్లక పోగా 2ఓట్లు నోటాకు పడ్డాయని ప్రకటించారు. అనంతరం జరిగిన పరిణామం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. మొదట పోటీ చేసిన ఇద్దరికీ సమానంగా ఓట్లు వచ్చాయని ప్రకటించిన రిటర్నింగ్ అధికారి స్రవంతి అనంతరం చెల్లని ఓట్లలో గడిపూడి వెంకటనారాయణకు ఓ ఓటు పడిందని ప్రకటించినందుకు కౌంటింగ్‌హాల్లో ఉన్న వీరభద్రం రీకౌంటింగ్ పెట్టాలని కోరగా ఆమె నిరాకరించి గడిపూడి వెంకటనారాయణ గెలుపొందాడని ప్రకటించడంతో ఆమె కౌంటింగ్‌హాల్లో గెలుపొందిన వెంకటనారాయణ బంధువుతో గంటసేపు ఫోన్‌లో మాట్లాడినట్లు వీరభద్రం ఆరోపిస్తున్నారు.ఎన్నికల నియమావళిని సుప్రీంకోర్టు నిబంధనను పాటించకుండా రీకౌంటింగ్ పెట్టకుండా ఆమె లాలూచీపడి కుమ్ముక్కై గడిపూడి వెంకటనారాయణ గెలుపొందినట్లు ప్రకటించిందని ఆ ఎన్నికను సవాల్ చేస్తూ గరిపూడి వీరభద్రం కోర్టును ఆశ్రయించారు. సెప్టెంబర్16న ఎన్నికపై వాదనలు కోర్టులో జరగనున్నాయని, వీరభద్రం తెలిపారు. పోటీ చేసిన అభ్యర్థి రీకౌంటింగ్ కోరగా నిరాకరించిన రిటర్నింగ్ అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని ఉద్యోగం నుంచి తొలిగించాలని డిమాండ్ చేశారు. గెలుపొందిన ఎన్నికపై కోర్టులో పిటిషన్ దాఖలు కాగా కోర్టు తుది తీర్పు ప్రకటించే వరకు తాళ్లచెరువు సర్పంచిని తొలిగిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని..జిల్లా కలెక్టర్‌ను కలవనున్నట్లు గడిపూడి వీరభద్రం తెలిపారు.అంతే కాకుండా గ్రామపంచాయతీలో పాలక పక్షం ఏకపక్ష నిర్ణయంతో వార్డు సభ్యులను పిలవకుండా తీర్మానాలు చేస్తున్నారని కొందరు వార్డు సభ్యులు ఆరోపిస్తున్నారు.

# సుడా పార్కును పరిశీలించిన ఛైర్మన్



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల కేంద్రమైన రఘునాథపాలెంలో స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్కును సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పరిశీలించారు. మంగళవారం సుడా వైస్ ఛైర్మన్, ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సుడా పార్కును పరిశీలించారు. పార్కులో మౌలిక వసతులు, పారిశుధ్య నిర్వహణ, సందర్శకులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ సుడా పార్కులో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించేలా సుడా పార్కులో అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎండి ఖాదర్‌బాబా, మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, రఘునాథపాలెం సర్పంచ్ గాజుల కృష్ణారావు, సొసైటీ ఛైర్మన్ తాతా రఘురాం, నాయకులు కమర్తపు మురళీ, శేఖర్ గౌడ్, పుచ్చకాయల వీరభద్రం, గౌస్, వెంకటయ్య పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్ విద్యార్థి గోమతికి సన్మానం



**ప్రజాపక్షం/చింతకాని :** తొలి ప్రయత్నంలోనే నీట్ యూజీ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో అత్యంత ప్రతిభకనబరిచి ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన రేపల్లెవాడకు చెందిన తోటకూరి గోమతిని గ్రామస్థులు మంగళవారం సన్మానించారు. గ్రామం నుంచి ఎంబీబీఎస్ చదువుతన్న తొలి విద్యార్థిగా గోమతి నలవడం గర్వకారణమని గ్రామస్థులు పేర్కొన్నారు. చింతకాని ఎస్సై జి నరేష్ మాట్లాడుతూ ఎంబీబీఎస్ విజయవంతంగా పూర్తి చేసి గ్రామానికి సేవ చేయాలని గోమతికి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు కొత్తపల్లి శివ, కొత్తపల్లి మల్లేశ్వరరావు, పోతగాని పుల్లారావు, సామినేని ఫణి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు షూ పంపిణీ



**ప్రజాపక్షం/మధిరః** మధిర మండలం సిద్దినేనిగూడెం(మర్లపాడు) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షూ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గ్రామ సర్పంచ్ వేల్పుల వెంకటరావమ్మ, వెంకటేశ్వర్లు హాజరై విద్యార్థులకు స్వయంగా షూలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఎటువంటి లోటు రాకుండా తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. గ్రామ అభివృద్ధితో పాటు విద్యాభివృద్ధికి కూడా తాము ఎల్లప్పుడూ కృసి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సూరంశెట్టి రాము, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కోసం రైతుల ఆందోళన



**ప్రజాపక్షం/పెనుబల్లిః** యూరియా కోసం రైతులు ఆందోళనకు దిగారు. పెనుబల్లి మండల సహకార పరపతి సంఘం ఎదుట మంగళవారం పెనుబల్లి మండలానికి చెందిన రైతులు యూరియా సరఫరా నిలిపివేశారని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సూర్య యాప్ లో బుక్ చేసుకున్నా యూరియా ఇవ్వడం లేదని రైతులు వాపోయారు. యూరియా నిల్వలు అయిపోయాయని సిబ్బంది తెలపడంతో రైతులు సొసైటీ యూరియా గోడౌన్ వద్ద బైఠాయించి ఆందోళనకు దిగారు.

# డా.నరేందర్ గౌడ్‌కు గౌరవ డాక్టరేట్




**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** మండల పరిధిలోని జూపెడ గ్రామానికి చెందిన మండాది నరేందర్ గౌడ్‌కు మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో హానరరీ డాక్టరేట్2026 లభించింది. ప్రజలకు ఉచిత వైద్య సేవలు, హెల్త్‌క్యాంపులు నిర్వహించడంతో పాటు కోవిడ్ సమయంలో సుమారు 500ల మంది బాధితులకు ఉచిత మందులు, ఆక్సీజన్, నిత్యావసర సరుకులు అందించిన సేవలను గుర్తించి ఈ గౌరవాన్ని అందించారు. గతంలో ఆయన సేవలకు సేవా రత్న, వైద్య రత్న అవార్డులు కూడా లభించాయి. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా డాక్టరేట్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా జూపెడ సర్పంచి వనవాసం పరేందర్ రెడ్డి, ఉప సర్పంచి బొల్లికొండ రాజశేఖర్, మాజీ ఎంపీటీసీ లంజపల్లి శ్రీనివాస్, గ్రామస్తులు నరేందర్ గౌడ్‌ను అభినందించారు.

# పోషకాహార వారోత్సవాలు



**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీ 1వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషకాహార వారోత్సవాల్లో కౌన్సిలర్ మోర్ శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైరా టౌన్ కాంగ్రేస్ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు, 1వ వార్డు కాంగ్రేస్ అధ్యక్షులు బుడిగి వెంకన్న, సూపర్‌వైజర్ కె.అరుణ, అంగన్‌వాడీ టీచర్ చింతపల్లి రేఖ, కాంగ్రేస్ నాయకులు, గర్భిణీలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలి

**-విధుల్లో నిర్లక్ష్యంపై ఆర్ఐ, ఎంపీడీవోకు చర్యలు**
**-భూ రికార్డుల్లో స్పష్టతకు కలెక్టర్ అంకిత్ ఆదేశాలు**



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. మంగళవారం మల్కానపల్లి, చిన్నబండిరేవు గ్రామాల్లో అభివృద్ధి పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యం, సరైన సమాచారం అందించడంలో వైఫల్యంపై సంబంధిత ఆర్ఐపై చర్యలకు, ఎంపీడీవో వివేక్ రామ్‌కు చార్జ్‌మెమో జారీ చేసి 24గంటల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. మల్కానపల్లిలో సుమారు రెండు కిలోమీటర్లు అటవీ ప్రాంతం గుండా నడిచి భూ రీ సర్వేను పరిశీలించిన కలెక్టర్, పాత రికార్డులు, మ్యాప్‌లు, క్షేత్రస్థాయి కొలతలను సమన్వయం చేసి భూ రికార్డుల్లో పూర్తి స్పష్టత తీసుకురావాలని సూచించారు. మండలంలోని ఎనిమిది గ్రామాల్లో రీ సర్వే జరుగుతుండగా, ఐదు గ్రామాల సరిహద్దుల నిర్ధారణ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం అందించాలని, గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాల వివరాలను సమగ్రంగా సేకరించాలని సూచించారు. చిన్నబండిరేవులో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను పరిశీలించి, నాణ్యతా ప్రమానాలు పాటిస్తూ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. పర్యటనలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, తహసీల్దార్ అశోక్ కుమార్, ఎంపీడీవో వివేక్ రామ్, రెవెన్యూ సర్వే గృహ నిర్మాణ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సాయుధ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగుదాం

**- కంచర్ల జమలయ్య**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్పూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరరం పోరాడాలని సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మగంళవారం పట్టణంలోని 3టౌన్ పరిధి బూడిదెగడ్డ సిపిఐ కార్యాలయంలో వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జమలయ్యతోపాటు చంద్రగిరి శ్రీనివాస్ జి వీరస్వామి మాట్లాడుతూ నిరంకుశ నిజాం భూస్వామ్య దోపిడీవ్యవస్థలకు వ్యతిరేకంగా సాగిన సాయుధపోరాటం ప్రపంచ చరిత్రలోనే ప్రత్యేక అధ్యాయం అన్నారు. వేలాదిమంది కమ్యూనిస్టు యోధులు ప్రాణాలర్పించి పేదలకు భూమి భుక్తిని అందించారని గుర్తు చేశారు. నేటి పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై ఎర్రజెండా అండతో సమరశీల పోరాటాలు నిర్మించడమే అమరులకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు.



ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు భూక్య శ్రీనివాస్ గోనె మణి నేరెళ్ల రమేష్ విజయలక్ష్మి నాయకులు మాచర్ల శ్రీనివాస్ నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు బోయిన విజయ్‌కుమ్ర్ బండి దుర్గ తుమ్మ నర్సయ్య శపావట్ రవి అజీజ్ గడ్డం సతీష్ ప్రభాకర్ ధనరాజ్ సాంబిరెడ్డి నరేష్ పసునూరి రమేష్ నట్టే వీరయ్య రాజేశ్వరరావు శివ సుజాత రూపేష్ రంజిత్ ఓదేలు సిందెం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

**- క్రీడాకారులను అభినందించిన మేయర్**



**ప్రజాపక్షం/పాల్వంచ :** చిన్ననాటి నుంచే విద్యార్థులు చదువుతో పాటుగా తమకిష్టమైన క్రీడలను ఎంచుకొని సాధన చేసి రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు సాధించవచ్చని కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. అంతర్జాతీయ వేదికపై అద్భుత ప్రతిభ కనభరిచి ప్రపంచ రికార్డుతో పాల్వంచ ఖ్యాతిని చాటిన విద్యార్థులు అబ్దుల్ నుమాన్, దీక్షితలను మంగళవారం ఆయన అభినంధించారు. వెంగళరావు కాలనీ, లిటల్ ఫ్లవర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభకు మేయర్ హాజరయ్యారు. ఈ సంధర్భంగా ప్రపంచ రికార్డు సృష్టించిన అబ్దుల్ నుమాన్, రావుల దీక్షితలను శాలువాలతో సత్కరించి మెమొంటోలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్లోబల్ వేదికపై మన ప్రాంత విద్యార్థులు ఉత్తమమైన ప్రతిభ చాటడం మనకందరికి గర్వకారణమని చెప్పారు.నేటి పోటీ ప్రపంచంలో చదువుతో పాటు శారీరక, మానసి ఉల్లాసానికి , కెరీర్ ఎదుగుదలకు క్రీడలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులను, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకం తోడైతే విద్యార్థులు ఏ రంగంలోనైనా అద్భుతాలు సృష్టిస్తారని పేర్కొన్నారు. అంతర్జాతీయ క్రీడల్లో రాణించిన విద్యార్థులు రాబోయే రోజుల్లో జరిగే క్రీడల్లో మరిన్ని విజయాలు సాధించి తల్లిదండ్రులకు, చదువుకొనే పాఠశాలకు, జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకొని రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబ, ఉప్పుశెట్టి రాహుల్, కార్పోరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, నామా కీర్తి, పగిడిపల్లి జయలక్ష్మి, హోలీ శ్రీను, నాయకులు కాసర్ల రామారావు, గౌతమి క్రిష్ణ, వల్లపు యాకయ్య, గొర్లె నరేష్, నామా పండు, నునావత్ దినేష్, ఆలపాటి ప్రసాద్, తులసీరామ్, కిరణ్, వాంకుడోత్ రవి, బిక్కూలాల్, అల్లి వెంకటేశ్వర్లు, పేరెంట్స్ అబ్దుల్ రహమాన్, ఆయేషా ఫిర్దోస్, రావుల శ్రీనివాస్, సుమలత, ఉపాద్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** లారీ ఢీకొనడంతో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన లక్ష్మీనగరం సమీపంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. లక్ష్మీనగరం గ్రామానికి చెందిన మద్ది రామిరెడ్డి(47)వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. సోమవారం సాయంత్రం బుర్రవేములలోని కిరాణా దుకాణానికి వెళ్లి సరుకులు తీసుకుని తన మోటార్ సైకిల్ ఏపీ20ఏజీ0074పై ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈక్రమంలో లక్ష్మీనగరం ఎస్‌బీఐ బ్యాంకు సమీపానికి చేరుకోగా చర్ల నుంచి భద్రాచలం వైపు వెళ్తున్న లారీ టీజీ05యూ3789వేగంగా, నిర్లక్ష్యంగా వచ్చి మోటార్ సైకిల్‌ను ఢీ కొట్టింది. ప్రమాదంలో రామిరెడ్డి రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై ఎస్ఐ శ్యామ్ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/కూసుమంచి:** కేజీబీవీ ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని పీఆర్‌టీయూ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కట్టా శేఖర్‌రావు డిమాండ్ చేశారు. సభ్యత్వ నమోదు, సమస్యల సేకరణలో భాగంగా మంగళవారం కూసుమంచి కేజీబీవీని సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. కేజీబీవీ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్, ఉద్యోగ భద్రత, ప్రభుత్వ కాంట్రిబ్యూషన్‌తో ఆరోగ్య కార్డులు కల్పించాలని కోరారు. విద్యార్థుల సంరక్షణ, పాఠశాల నిర్వహణకు ప్రత్యేకంగా కేర్ , వార్డెన్ పోస్టులు మంజూరు చేయడంతో పాటు సిబ్బందిపై అదనపు పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. బదిలీలు, సెలవులు, వేతనాలు, ఇతర ఉద్యోగ ప్రయోజనాల్లో స్పష్టమైన సేవా నిబంధనలు అమలు చేయాలని కోరారు. కేజీబీవీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ నిరంతరం పోరాడుతోందని, ఎంఎల్‌సీ పాల్‌రెడ్డి కృషితో పలు సమస్యలు పరిష్కారమయ్యాయని శేఖర్‌రావు తెలిపారు. భవిష్యత్తులోనూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు టి రత్నకుమార్, ఉపాధ్యక్షుడు టి చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు ఎస్ ఆంజనేయులు, పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 17 విలీన దినం మాత్రమే

**- హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయండి**



**ప్రజాపక్షం/పాల్వంచ :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని కొన్ని పార్టీలు తమకు అనుకూలంగా మార్చుకొని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు ఆరోపించారు. మండల పరిధి మొండికట్ట గ్రామంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరవీరుల వారోత్సవ సభ రైతు సంఘం మండల అధ్యక్షులు కొంగర అప్పారావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సంధర్భంగా పూర్ణచందర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమర వీరుల వారోత్సవాల సభల ముగింపు సంధర్భంగా ఈ నెల 17వ, తేదీన హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగే భారీ బహిరంగ సభకు అన్ని వర్గాల ప్రజల హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మొండికట్ట, కారెగట్టు, మందెరికలపాడు సర్పంచులు జర్పుల సంధ్య, వట్టం బాబూరావు, బానోత్ లక్ష్మి మోహన్, రపజా సంఘాల నాయకులు చిల్లా క్రిష్ణ, ఎం. వెంకటముత్యం, జి. దేవేందర్, సారయ్య, చెన్నయ్య, కోరెం చంద్రశేఖర్, ఉంద్రాతి రవి, కోట సుందర్‌రావు, కారెగట్టు, మందెరికలపాడు, సత్యనారాయణపురం పంచాయితీల ఉప సర్పంచులు యాదగిరి, కందుకూరు శ్రీను, వేముల నరేష్, వజ్జా వెంకన్న, నిట్ట అమృతరావు, వజ్జా వాసు, సత్యం, ఆవుల సతీష్, బి. ఉపేందర్‌రెడ్డి, కాసీమ్, శెట్టుపల్లి లక్ష్మణరావు, బానోత్ వినోద్, సురేష్, అచ్చయ్య, చంద్రకళ, కందుకూరి రాములు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు వాటర్ డిస్పెన్సర్ అందజేత



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి, గత ఆగస్టు 31న ఉద్యోగ విరమణ పొందిన వెన్న ఉదయ సేత్ తన ఉద్యోగ జీవితానికి గుర్తుగా పాఠశాల సిబ్బందికి ఉపయోగపడే విధంగా రూ.16,000 విలువైన వోల్టాస్ కంపెనీ వాటర్ డిస్పెన్సర్ (వాటర్ కూలర్, మినీ ఫ్రిజ్)ను మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. లక్ష్మి నరసయ్యకి అందజేశారు. ఈ సందర్భంగా వెన్న ఉదయ సేత్ మాట్లాడుతూ తాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జూలూరుపాడులో విధులు నిర్వహించిన కాలంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది తనను ఎంతో ఆప్యాయంగా, అభిమానంతో, గౌరవంగా చూసుకున్నారని తెలిపారు. పాఠశాలతో తనకు ఏర్పడిన ఆత్మీయ అనుబంధానికి గుర్తుగా ఈ వాటర్ డిస్పెన్సర్‌ను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా పాఠశాల పట్ల తనకున్న అభిమానం, ఆత్మీయతను చాటుతూ సిబ్బంది ఉపయోగార్థం విలువైన వాటర్ డిస్పెన్సర్‌ను అందజేయడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. లక్ష్మి నరసయ్య, ఉపాధ్యాయులు మరియు ఉపాధ్యాయేతర సిబ్బంది వెన్న ఉదయ సేత్ ని అభినందిస్తూ, హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సేవలను, పాఠశాల పట్ల చూపిన అభిమానాన్ని పాఠశాల సిబ్బంది కొనియాడారు.

## చుంచుపల్లిలో సమగ్ర భూసర్వే

**ప్రజాపక్షం/చుంచుపల్లి:** చుంచుపల్లి మండల రెవెన్యూ పరిధిలో సుమారు 2200 ఎకరాల భూములకు బౌండరీలు ఏర్పాటు చేసి సమగ్ర సర్వే నిర్వహించేందుకు భూముల హద్దులను గుర్తించి క్షేత్రస్థాయి వివరాలను రెవెన్యూ రికార్డులతో అనుసంధానం చేయనున్నట్లు తహశీల్దార్ కూచిపూడి నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత గ్రామపంచాయతీ అధికారులకు భూముల హద్దులు, వివరాలతో కూడిన ఫామ్2, ఫామ్3లను అందజేసి, వాటి ఆధారంగా సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. గతంలో భూములు ఉన్నప్పటికీ పట్టా పాస్‌బుక్ కేటాయించే ప్రక్రియను చేపడతామని తెలిపారు. సర్వే అనంతరం అందుబాటులో ఉన్న రికార్డులను పరిశీలించి నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడతామన్నారు. రైతులు సర్వే సమయంలో అధికారులకు సహకరించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మంగాపురం మేజర్‌కు నీటి విడుదల చేయాలని ఆందోళన



**ప్రజాపక్షం/నేలకొండపలి :** మంగాపురం మేజర్ కు నీటిని విడుదల చేయాలని రైతులు ఆందోళన నిర్వహించారు. మంగళవారం రైతులు మేజర్ కాలువ లోకి దిగి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఇరిగేషన్ సీఈ వాసంతి ని ఖమ్మం లో కలిసి వినతి ప్రతం ను అందించారు. ఈ సందర్భంగా చెరువుమాదారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి మాట్లాడారు. మంగాపురం తండా కాలువ కు నీటి చుక్క రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం 500 క్యూసెకుల నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. ఇరిగేషన్ అధికారులు కనీసం కాలువ వైపు కూడ తొంగి చూడటం లేదని అగ్రహాం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు ప్రతినిధులు భూక్యా గోబ్రియా. నాగేశ్వరరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ములకలపల్లి కమ్మ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండల కమ్మ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తేళ్ల చెన్నయ్య, ఉపాధ్యక్షుడిగా అనుమాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా నందముని నరేష్, కోశాధికారిగా సాయిన్ని మధుసూదన్‌రావు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బాల అప్పారావు, చీకటి ప్రకాష్, మాచినేని సత్యనారాయణ, కరుటూరి వెంకటేశ్వరరావు, గంగవరపు సుధాకర్, నరుకుళ్ల సుధాకర్, నరుకుళ్ల రంగారావు, నున్నా భాను, యలమంచిలి సునీల్, అల్లూరి శ్రీనివాసరావు, గౌరవ సలహాదారులుగా పర్వతనేని అమర్నాథ్, తన్నీరు చిన్న పుల్లయ్య, పేరసాని శ్రీనివాసరావు, కరుటూరి కృష్ణలు ఎన్నికయ్యారు.

# మార్కుల వేటలో మానవీయ విలువలు మాయం..!


(ఫైల్)

**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లిదండ్రులకు దూరమవుతున్న పిల్లలు పెరుగుతున్న ఒత్తిడి, చెడు అలవాట్ల ప్రభావం, మారుతున్న జీవనశైలి ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులకు కేవలం పాఠ్యపుస్తకాల విద్య సరిపోతుందా...? మంచి మార్కులు సాధించడం మాత్రమే విద్య లక్ష్యమా...? లేక సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి అవసరమైన విలువలు, క్రమశిక్షణ, విచక్షణ, బాధ్యత కూడా నేర్పించాల్సిన అవసరం ఉందా...? అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతున్నాయి. మార్కులతో పాటు విలువలు కూడా అవసరం. ప్రస్తుతం విద్యార్థులపై చదువు, పోటీ, కెరీర్, ఒత్తిడి పెరుగుతుంది. అదే సమయంలో మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, ఇంటర్‌నెట్ ద్వారా చిన్న వయసులోనే అనేక రకాల సమాచారానికి పిల్లలు చేరువవుతున్నారు. సరైంది తప్పు, మంచి , చెడు, బాధ్యత, బాధ్యతారాహిత్యం మధ్య తేడాను గుర్తించే సామర్థ్యం ప్రతి విద్యార్థిలో పెంపొందించాల్సిన అవసరం ఉంది. అందుకే పాఠశాలల్లో వారానికి కనీసం ఒకసారి మోరల్ ఎడ్యుకేషన్ లేదా లైఫ్ స్కిల్స్ నిర్వహించడం ప్రయోజనకరంగా ఉంటుంది. భారత విద్యా వ్యవస్థలోనూ జీవన నైపుణ్యాలు, ఆరోగ్యం, సంబంధాలు,విలువలు, బాధ్యతాయుత ప్రవర్తన వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చే కార్యక్రమాలు ఉన్నాయి. తల్లిదండ్రులకు భయపడటం కాదు గౌరవం, అవగాహన అవసరం గతంలో పిల్లలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన మాటను ఎక్కువగా వినేవారని పెద్దలు చెబుతుంటారు. నేటి పరిస్థితుల్లో పిల్లల్లో ప్రశ్నించే స్వభావం పెరిగింది. ఇది తప్పు కాదు కానీ ప్రశ్నించే స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా ఉండాలని నిపుణులు చెబుతున్నారు. భయంతో పెంచడం కాదు స్నేహపూర్వకంగా మాట్లాడి సరైన దారిని చూపడం నేటి తల్లిదండ్రుల బాధ్యత పిల్లల ప్రవర్తనలో ఆకస్మాత్తుగా మార్పులు కనిపిస్తే వారిని తిట్టడం లేదా శిక్షించం కంటే కారణాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయాలి. కేంద్ర విద్యా శాఖ మార్గదర్శకాలలో కూడా పిల్లలతో తీర్పు చెప్పే ధోరణి లేకుండా మాట్లాడటం, తల్లిదండ్రులతో సంబంధాన్ని బలోపేతం చేయడం, పాజిటివ్ పేరెంటింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

### గంజాయి, పొగాకు చెడు అలవాట్లకు అడ్డుకట్ట ...

చిన్న వయస్సులో పొగాకు, గుట్కా మద్యం లేదా ఇతర మాదక పదార్థాల వైపు వెళ్లకుండా ముందస్తు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. స్నేహితుల ఒత్తిడి, ఆసక్తి, అనుకరణ, కుటుంబ వాతావరణం వంటి అంశాలు పిల్లల ప్రవర్తనపై ప్రభావం చూపవచ్చు. ఇందు కోసం పాఠశాలల్లో కౌన్సిలింగ్, అవగాహన కార్యక్రమాలు, క్రీడలు, సాంస్కృ

## -విద్యార్థుల భవిష్యత్తును మార్చాలంటే విద్యా విధానంలో మార్పు రావాలి


(ఫైల్)

తిక కార్యక్రమాలు, ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయ కార్యకలాపాలను పెంచాలి. కేంద్ర విద్యాశాఖ ప్రస్తుతం నషా ముక్త్ విద్యాలయ కార్యక్రమం ద్వారా పాఠశాలలను పొగాకు, మద్యం, మాదక పదార్థాల రహిత వాతావరణంగా తీర్చిదిద్దే చర్యలను ప్రోత్సహిస్తుంది.

### వయసుకు తగిన ఆరోగ్య అవగాహన...

పిల్లలకు పాఠశాల స్థాయి నుంచే వయస్సు తగిన శాస్త్రీయ లైంగిక ఆరోగ్య విద్య అవసరం. దీనిని తప్పుగా అర్థం చేసుకోకూడదు. శరీరంలో వచ్చే మార్పులు, వ్యక్తిగత పరిశుభ్రత, మంచి, చెడు స్పర్శ, వ్యక్తిగత హద్దులు, ఆన్‌లైన్ భద్రత, వేధింపుల నుంచి రక్షణ, ఇతరులను గౌరవించడం వంటి విషయాలను వయసుకు అనుగుణంగా బోధించాలని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి అవగాహన పిల్లల్లో భయం కలిగించడానికి కాదు వారిని రక్షించడానికి సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంచడానికి ఎంతో అవసరం. భారతదేశంలోని పాఠశాల ఆరోగ్యం, కౌమర విద్యా కార్యక్రమాల్లో కూడా జీవన నైపుణ్యాలు, సంబంధాలు, లైంగిక, ఆరోగ్యం, భద్రత వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

### విద్యా విధానంలో మార్పు తప్పనిసరి...

ఇక విద్య అంటే కేవలం పుస్తకాలు, పరీక్షలు, మార్కులు అనే ఆలోచన నుంచి బయటపడాల్సిన సమయం వచ్చింది. చదువు, విలువలు,క్రమశిక్షణ, ఆరోగ్యం , క్రీడలు, జీవన నైపుణ్యాలు, సాంకేతిక అవగాహన, సామాజిక బాధ్యత కలిసినప్పుడే విద్యార్థి సంపూర్ణంగా ఎదగగలడు. పాఠశాలలో ఉపాధ్యాయులు బోధించే పాఠాలతో పాటు తల్లిదండ్రులు ఇంట్లో పిల్లలతో మాట్లాడే విధానం కూడా అంతే ముఖ్యం. పాఠశాలలు, తల్లిదండ్రులు, వైద్యులు, కౌన్సిలర్లు, సమాజం కలిసి పనిచేసినప్పుడే పిల్లలను సరైన దారిలో నడిపించగలుగుతాం. మార్కులు సాధించే విద్యార్థులు మాత్రమే కాదు. మంచి మనుషులుగా ఎదిగే విద్యార్థులు కావాలి. అందుకే ప్రతి పాఠశాలలో మోరల్ ఎడ్యుకేషన్, లైఫ్ స్కిల్స్, ఆరోగ్య అవగాహన, మాదక ద్రవ్యాల నిరోధక విద్య, వయసుకు తగిన భద్రత, లైంగిక ఆరోగ్య అవగాహన, కౌన్సిలింగ్‌కు తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. విద్యార్థుల భవిష్యత్తును మార్చాలంటే విద్యా విధానంలో మార్పు ఇప్పుడే ప్రారంభం కావాలి.

# తనికెళ్ల చెరువుకు సాగర్ నీరు

## -సిపిఐ విజ్ఞప్తికి స్పందించిన ఎస్‌ఈ



**ప్రజాపక్షం/కొణిజర్ల :** కొణిజర్ల మండల పరిధిలోని తనికెళ్ల నర్సింహులు చెరువు క్రింద సాగు చేసిన పంటలు ఎండిపోతుండడంతో సిపిఐ మండల కార్యదర్శి గడల భాస్కర్ ఈ విషయాన్ని ఎన్నెస్పి ఎస్‌ఈ దృష్టికి తీసుకెళ్లారు. పంటలను కాపాడేందుకు ప్రయత్నం చేయాలని ఇప్పటికే రైతులు ప్రతి ఎకరాకు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టారని ఆయన ఎస్‌ఈ దృష్టికి తీసుకెళ్లారు. సిపిఐ మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు విజ్ఞప్తికి స్పందించిన ఎస్‌ఈ మంగళవారం వెంకటాయపాలెం ఎత్తిపోతల పథకం నుంచి తనికెళ్ల నర్సింహులు చెరువును సాగర్ జలాలతో నింపుతామని హామీ ఇచ్చారని భాస్కర్‌రావు తెలిపారు.

# హత్యాయత్నం కేసులో ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** ఖమ్మం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన హత్యాయత్నం కేసులో నిందితుడు మరుపల్లి రాంబాబుకు ఐదేండ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.41,500 జరిమానా విధిస్తూ మొదటి అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు, ఖమ్మం న్యాయమూర్తి శివరంజని తీర్పునిచ్చారు. ఖమ్మం వన్‌టౌన్‌లో చెరువు బజార్‌కు చెందిన మరుపల్లి రాంబాబుపై నమోదైన కేసులో దర్యాప్తు అనంతరం పోలీసులు సమర్పించిన ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం పైవిధంగా తీర్పునిచ్చింది. ఎస్‌ఐలు కె. వెంకటేష్, యయాతిరాజ్ ఆధ్వర్యంలో దర్యాప్తు పూర్తి చేశారు. కేసు విచారణలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పావని, స్వప్నలు న్యాయస్థానంలో వాదనలు వినిపించారు.

# విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



**ప్రజాపక్షం/ తల్లాడ :** అన్నారుగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, షూస్ పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పాఠశాల విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన కార్యక్రమంలో అన్నారుగూడెం సర్పంచ్ గొర్ల ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు యూనిఫాం, షూస్ పంపిణీ చేశారు. విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో, క్రమశిక్షణతో విద్యనభ్యసించేందుకు పాఠశాలల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దామోదర్ ప్రసాద్, ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు, వార్డు మెంబర్ డేవిడ్, మాజీ ఎంపిటిసి గోవిందు శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్బంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సర్పంచ్ ప్రభాకర్, ఉప సర్పంచ్ వెంకటేశ్వర్లు, పాలక వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యారంగ పరిరక్షణకు విద్యార్థులు ఉద్యమించాలి



**ప్రజాపక్షం/ బోనకల్ :** నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించేందుకు విద్యార్థులు ఉద్యమించాలని ఎఐఎస్‌ఎఫ్ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు షేక్.నాగుల్‌మీరా పిలుపునిచ్చారు. మంగళవారం బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యారంగ సమస్యలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు సెప్టెంబర్ 18, 19తేదీల్లో ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఐఎంఎహాల్‌లో ఎఐఎస్‌ఎఫ్ ఖమ్మం జిల్లా 27వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 300మంది విద్యార్థులు హాజరుకానున్నారని, మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎఐఎస్‌ఎఫ్ నూతన కౌన్సిల్‌ను 21మంది విద్యార్థులతో ఎన్నుకున్నారు. కళాశాల అధ్యక్షుడిగా జె.ఉపేంద్ర, కార్యదర్శిగా ఎ.నాగచైతన్య, ఉపాధ్యక్షులుగా ఎం.పల్లవి, హేమంత్, సహాయ కార్యదర్శులుగా సాయికుమార్, జ్యోతిర్మయి ఎన్నికయ్యారు. మరో 14మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ మధిర డివిజన్ నాయకులు ఎస్కే ఖాసీం, బాజీ, బోనకల్ మండల నాయకులు సుధాకర్, వెంకట్‌తో పాటు కళాశాల విద్యార్థులు సంతోష్, గౌతమ్, బాల ప్రశాంత్, రాజేశ్వరి, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పొన్నెకల్ విద్యార్థిని



**ప్రజాపక్షం/కామేపల్లి:** జెడ్‌పీహెచ్‌ఎస్ పొన్నెకల్ విద్యార్థిని ఏ తేజస్విని రాష్ట్ర స్థాయి బాలికల కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఖమ్మం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన తేజస్విని ఖమ్మం జిల్లా జట్టుకు ఎంపికైంది. ఈనెల 26 నుంచి 29 వరకు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఖమ్మం జిల్లా తరపున తేజస్విని పాల్గొననుంది. ఆమెను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోటేశ్వరమ్మ, ఏఏపీసీ ఛైర్మన్, ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్ వి సత్యనారాయణ, గ్రామ పెద్దలు అభినందించారు.

# ఘనంగా పోషణ మాసోత్సవాలు



**ప్రజాపక్షం/పాల్వంచ :** ఐసిడిఎస్ పాల్వంచ ప్రాజెక్టు వెంగళరావు కాలనీ సెక్టార్ పరిధి గాంధీనగర్ 2 అంగన్వాడీ కేంద్రంలో మన అగన్‌వాడీ, మన బాద్యత నినాదంతో 9వ, పోషణ మాసోత్సవా లను మంగళవారం ఘనంగా నిర్వ హించారు. ఈ సంధర్భంగా 44వ, డివిజన్ కార్పోరేటర్ వీసంశెట్టి విశ్వేశ్వరరావు దంపతులు పాల్గొని పిల్లలకు విద్యాభ్యాసం, అన్న ప్రాసన, గర్భిణీలకు శ్రీమంతం నిర్వహించారు. అనంతరం వీసంశెట్టి మాట్లాడుతూ పౌష్టికాహారంతో పిల్లలు దృఢంగా ఎదుగుతారని తెలిపారు. దీనితో పిల్లలకు ఏకాగ్రత పెరిగి చదువులో ముందంజలో ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్ నాగమణి, అంగన్వాడీ టీచర్లు, బాలింతలు, గర్భిణీలు, చిన్నారులు, పేరెంట్స్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలి




**ప్రజాపక్షం/వైరా:** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు మరింతగా కృషి చేయాలని వైరా ఎంఈవో చావా శ్రీనివాసరావు అన్నారు. వైరా మండలం విప్పలమడక గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు పోతినేని సరోజిని మాలకొండయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం రూ.40వేలు విలువైన సామాగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠశాలలకు బ్లాక్‌బోర్డులను ఎంఈవో చావా శ్రీనివాసరావు, ట్రస్ట్ చైర్మన్ పోతినేని భూమేశ్వరరావు, మాజీ సర్పంచ్ పారుపల్లి కృష్ణారావు అందజేశారు. అనంతరం పారుపల్లి కృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల అభివృద్ధికి పోతినేని చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు ఆదర్శనీయమన్నారు. భవిష్యత్తులోను మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ట్రస్ట్ చైర్మన్ పోతినేని

## వైరా ఎంఈవో చావా శ్రీనివాసరావు

భూమేశ్వరరావు మాట్లాడుతూ విప్పలమడక గ్రామ అభివృద్ధిలో తమ ట్రస్ట్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. గ్రామంలోని సోమలింగేశ్వరస్వామి దేవాలయంలో నవవిగ్రహాల ప్రతిష్టతో పాటు పెండింగ్ పనుల పూర్తికి ట్రస్ట్ తరపున రూ.10లక్షల విరాళాన్ని ప్రకటించారు. అలాగే గ్రామ సర్పంచ్ మేడా హేమియా చక్రపాణి, గ్రామ పెద్దల సహకారంతో మరో రూ.20లక్షలు నిధులు సమీకరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. తాను మధ్యతరగతి కుటుంబంలో జన్మించి, తల్లిదండ్రుల సహకారంతో విద్యాభ్యాసంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని ప్రస్తుతం ఈ స్థాయికి చేరుకోవడం ఆనందంగా ఉందన్నారు. భ ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఆకుల ప్రసాద్, ట్రస్ట్ నిర్వాహకులు పోతినేని మాలకొండయ్య, పోతినేని రమాదేవి, సోమలింగేశ్వరస్వామి దేవాలయ చైర్మన్ వీరపనేని చెన్నకేశవరావు, వాసిరెడ్డి అర్జున్‌రావు, ఉప సర్పంచ్ బూర్గు లూర్దమ్మ, ప్రధానోపాధ్యాయులు ఏ.రమేష్, అమర్లపూడి రవి, రామిశెట్టి లతామాధురి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# పర్ణశాలలో గణేష్ నిమజ్జన పాయింట్ పరిశీలన



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** స్థానికుల వినతుల మేరకు పర్ణశాల గోదావరి తీరంలో వినాయక నిమజ్జనోత్సవ ఏర్పాట్ల సాధ్యాసాధ్యాలను అధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ అంకిత్, ఎంఎల్‌ఏ డాక్టర్ తెల్లం వెంకట్రావు, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ ఆదేశాల మేరకు స్థానిక సర్పంచ్ వాగే ఖాదర్‌బాబు, తహసీల్దార్ మామిడి అశోక్ కుమార్, సీఐ వెంకటపయ్య, ఎంపీడీవో వివేక్ రామ్ తదితరులు పరిశీలన చేపట్టారు. గోదావరి తీరంలో ర్యాంప్, నిమజ్జన పాయింట్, నది లోతు, విద్యుత్ సౌకర్యం, పారిశుద్ధ్యం, పార్కింగ రూట్ మ్యాప్ తదితర అంశాలను పరిశీలించి చర్చించారు. క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా పూర్తి నివేదిక రూపొందించి తుది నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ సూర్యం, విద్యుత్ శాఖ ఎల్‌ఐ కృష్ణ, పంచాయితీ కార్యదర్శి సురేష్, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.